# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి

VOLUME 32 ISSUE 2
No. OF PAGES 40
OCTOBER 2012

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by
C.V. Ramana Babu
on behalf of
YOGINI SRI CHANDRA
KALI PRASADA MATHAJI
CHARITABLE TRUST
and Printed at
Samardha Sadguru Publications,
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh and
Published at
D.No. 3-499, Sri Kali Gardens
Ashram, Nambur - 522508, Guntur
Dist., Andhra Pradesh, Editor
DUGGIRALA JAGANMOHANA
BALA KRISHNA LAL

**ఈ సంచికలో............................ ....... పేజీ**

| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 7 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| కాళీవనాశ్రమంలో చాతుర్మాస్య సత్సంగ వివరాలు | 12 |
| దారితప్పిన భక్తుని భగవంతుడు రక్షిస్తాడు | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| శివానందలహరి | 22 |
| స్థిత ప్రజ్ఞస్య కా భాషా? | 24 |
| త్రిపురా (రహస్య) మహాత్మ్యము | 25 |
| కపట ప్రేమ- దివ్యప్రేమ | 30 |
| నేను అర్థం చేసుకున్న శ్రద్ధాత్రయ విభాగ యోగం | 32 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 34 |
| రావణుని పూర్వజన్మ వృత్తాంతము | 36 |
| విష్ణు కథలు | 38 |

**శ్రీదేవీ శరన్నవరాత్రి సందర్భంగా పాఠకులకు శుభాకాంక్షలు**

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

ఇత్యా పృష్టః స రామేణ పునః ప్రాహాత్రినందనః
శ్రుణు రామ ప్రవక్ష్యామి సర్వసారతమం పునః
యా చితి పరమేశాన పూర్ణాహంతా మయా పరా
సా స్వాతంత్ర్యాభిధా మాయా శక్తి మహాత్మ్యతః ॥

(త్రిపురా రహస్యం)

శ్రీ దత్తాత్రేయుని బోధవిన్న పరశురాముడు శుద్ధ చిదాత్మ తత్త్వాన్ని తెలుసుకున్నవాడై, సర్వత్రా వ్యాప్తమై యున్న, చిద్రూపమైన నా ఆత్మయే అంతటా ప్రకాశిస్తున్నది అని తెలుసుకున్నాను. అయినా మనస్సులో స్థిరమైన భావాన్ని నిలుపుకోవటానికి మీరు యింతవరకు వివరించిన సారాన్ని సంక్షిప్తంగా బోధించమని కోరగా తెలియజేసిన సారభూతమైన విషయాన్ని వివరించే శ్లోకము.

శ్రీ దత్తాత్రేయుడు పరశురామునికి బోధ చేస్తూ 'చిద్రూపమైన ఆత్మయే నేను ' అని నీవు అనుభవించే ఆ చిత్తే అంటే జ్ఞానమే లేక ప్రకాశమే పరమేశాని, ఆమెయే పూర్ణాహంతా రూపిణి, తన్మయి, పరరూపిణి అని తెలియజేశారు.ఇంకా వివరిస్తూ పరమేశాని అంటే పరమేశ్వరి అని అన్నింటికన్న అధికమైన లేక ఆధిక్యతగల నియంత్రించే శక్తి అని గ్రహించాలి. అంతేకాదు పూర్ణాహంతా అంటే పూర్తి స్వాతంత్ర్యం కలది అని అర్థం. చితి అంటే జడము కాదు. విలక్షణమైనది. స్వయం ప్రకాశమైనది. 'నేను' అనే జ్ఞానమే పరాచిత. 'అహం' అనే నేను దేహాదులయందు కూడా ఉన్నప్పటికీ అది పరిపూర్ణ జ్ఞానం కాదు. దేహాదులన్నీ పరిచ్ఛిన్నాలే కదా! చితి అనబడేది సర్వవ్యాపకమైనది. ఒక ఉపాధికి పరిమితమైనది కాదు. కాబట్టి దానిని పూర్ణాహంతా అనటం సమంజసం. చితి తన మాయాశక్తి వలన ఎప్పుడూ అద్దంలో ప్రతిబింబంలాగ జగత్తును తనలో భాసింపజేస్తుంది కాబట్టి స్వాతంత్ర్యం అనబడుతోంది.

సృష్టి క్రియయే మాయ. సృష్టించవలెనని కోరికయే స్వాతంత్ర్యము. పూర్ణాహంతా అనేది జ్ఞానశక్తి, స్వాతంత్ర్యము అనేది ఇచ్ఛాశక్తి, మాయ అనబడేది క్రియాశక్తి. ఈ జగత్తు అంతా దర్పణతుల్యమే కాని యదార్థం కాదు. సృష్టి స్థితి లయాలు ఉన్నట్లు భావనమాత్రమే తప్ప యదార్థంగా జగత్తు పుట్టనే లేదు. ప్రతిబింబాలు దర్పణం కన్నా భిన్నం కాదు కదా! అలాగే జగత్తు పరాచితకు ఎన్నడూ భిన్నం కాదు. ఈ వుపాధితో ఉన్న ఎవరైనా 'అహం' లేక 'నేను' అనే భావన చేస్తారు. అయినా ఆ 'నేను' అనే భావనతోనే వివిధ ఇంద్రియ వ్యాపారాలు నిర్వర్తిస్తున్నారు కదా! అలాగే పరాచిత తాను సర్వవ్యాపకంగా ఉంటూ, పిపీలికాది బ్రహ్మాపర్యంతం ఉన్న అందరికీ ఆశ్రయంగానే ఉంటూ అన్ని అహం భావాలకు తానే ఆధారము. ఉపాధులే భేదభావాలకు, దుఃఖాలకు కారణం.దృశ్యము, దుఃఖము లేనప్పుడు మహదానందమే కదా!

# యోగి వేమన

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

10. ఇంటియాలి విడిచి యిల జారకాంతల
వెంటఁదిరుగువాఁడు వెఱ్ఱివాఁడు,
పంటచేను విడిచి పరిగయేరినయట్లు
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

కట్టుకొన్న భార్యను విడిచి పరకాంత వెంట తిరుగు మూర్ఖుడు, పంటచేను విడిచిపెట్టి పరిగ గింజలకు ఆశపడెడు వాని వంటివాడే యగును.

11. ఇంద్రియములచేత నెగ్గొందుచుండెడు
వెఱ్ఱి మనుజుఁడెల్ల వెదకు శివుని
ఇంద్రియముల రోసి యీశునిఁజూడరా
విశ్వదాభిరామ వినుర వేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు యింద్రియములను అరికట్టక భగవంతుని చూడగోరును. ఇంద్రియ నిగ్రహము కలవారే భగవంతుని చూడగలరు.

12. ఇన్ని జాతులందు నేజాతి ముఖ్యమన్
ఎఱుక గల్గువారె హెచ్చువారు
ఎఱుక లేనివార లేజాతినున్నను
జీనజాతియంచు నెఱుఁగు వేమ

తాత్పర్యము -

జాతులన్నిటిలో ఏ జాతి గొప్పది? అని ప్రశ్నించిన, జ్ఞానమున్నవారే గొప్పవారని తెలియవలెను. జ్ఞానములేనివారు ఉత్తమజాతివారైనను, నీచజాతివారే అగుదురు.

# శ్రీబాబూజీ ఉవాచ

– వెంకటరమణ ప్రసాద్

గత సంచిక తరువాయి

నేను యిలా అంటుంటే, యివన్నీ అబద్ధాలనీ, కల్పనలనీ కొట్టిపారేసేవారు కొందరుంటారు. కాని నేను చెప్పేది పరమ సత్యం. నా మాటలను సరిగ్గా అర్ధం చేసుకుంటే, నిష్పక్షపాత దృష్టితో వింటే, పరమహేతువాదులూ,



నాస్తికులూ కూడా నాతో ఏకీభవించక తప్పదు. పిల్లలు చేసే అల్లరి సహించి, వాళ్లకు కావలసిన అవసరాలన్నీ ఎప్పటికప్పుడు సమకూర్చి, వాళ్ళని పెంచుకు వచ్చే తల్లులను మనం చూడటం లేదూ? ఎన్నిసార్లు నువ్వు చేసిన తప్పులను క్షమించి, నీ తండ్రి నిన్ను బాల్యంలో రక్షించలేదూ? నీ తల్లిదండ్రులు బాల్యంలో నీపై కురిపించిన ప్రేమాభిమానాలను యింకా మరచిపోకుండా వుంటే నీకు నా మాటలు అర్థం అవుతాయి.

తల్లిదండ్రులకు తమ సంతానం వాళ్ళు రూపసులుగాని, కురూపులుగానీ, తెలివిగలవాళ్ళుగానీ, మూర్ఖులుగానీ అందరూ సమానమే.మామూలు తల్లిదండ్రులే యిలా తమ ప్రేమను సమానంగా పంచియిస్తుంటే, పరమపిత అయిన భగవానుడు యింక ఎంతగా తన సంతానమైన మనందరినీ ప్రేమించాలి? భగవంతుడికి తన బిడ్డలమైన మన మీద ఉన్న ప్రేమను 'యింత' అని లెక్కగట్టి చెప్పగల షరాబులెవరు? ఏ కవి ఆ దివ్య ప్రేమను వర్ణించి చెప్పగల సమర్థుడు? ఇవన్నీ యిలా ఉంచి, తన సంతానంలోకెల్లా పరమయోగ్యుడూ, భక్తుడూ, సుగుణాలరాశీ, మహాకవీ అయిన సూరదాసంటే భగవంతుడికెంత ప్రేమ ఉండాలి? మామూలు తల్లిదండ్రులే వికలాంగులైన తమ బిడ్డలపైన ఎంతో ప్రేమను చూపుతారే! అటువంటిది సూరదాసుపైన శ్యామసుందరునికి ప్రత్యేకమైన శ్రద్ధ ఉండదా?

తన భక్తులను ఆదుకోవటమేకాదు, వాళ్ళకు అవసరమైన సందర్భాలలో భగవంతుడు స్వయంగా దిగివచ్చి ఊడిగం చేసిన సంఘటనలు మన ఆధునిక యుగంలోనే అనేకం ఉన్నాయి. సక్కుబాయి కోరికను తీర్చటానికి ఆమెను పండరీపురం పంపించి, ఆమె బదులుగ ఆమె గయ్యాళి అత్తగారికి సేవ చేసిన విషయం అందరికీ తెలిసినదే కదా? ఇంక యిటీవలి కాలంలో రామదాసును విడిపించటానికి రామలక్ష్మణు లిద్దరూ తానీషాకు దర్శనం యిచ్చింది జగద్విదితమే కదా? మరి నిన్నటివాడు త్యాగరాజు. ఆయన పల్లకీలో ప్రయాణం చేస్తూంటే రామలక్ష్మణులిద్దరూ ముందువెనుకలు యిరు ప్రక్కల తోడై దోపిడీగాండ్రను చంపకుండా మిట్టకోలలతో బెదిరించి తరిమివేసిన సంఘటన జగత్ప్రసిద్ధమే కదా?

అనన్యాశ్చింత యన్తో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్ ॥

(భ.గీ. 9 - 22)

"నన్ను అనన్య మనస్సుతో ఎవరు సదా స్మరిస్తూ ఉపాసిస్తారో, అట్టి నిత్య యోగనిష్ఠులైన వారి యోగక్షేమాలను నేనే భరిస్తాను" అని వాగ్దానం చేశాడు కదా స్వామి? మరి ఆయన మాట తప్పుతాడా?

అయితే భగవంతుడి నుంచి అటువంటి రక్షణ పొందాలంటే, భక్తుడి భక్తి నిత్యమైనదీ, తీవ్రమైనదీ, అయి ఉండాలి. అతడి మనస్సు అనుక్షణము భగవధ్యానంలోనే నిమగ్నమై ఉండాలి. అనన్య స్మరణలేక, తైలధారవలె నిరంతర భగవధ్యానం జరగాలి. అప్పుడు ఆ భక్తుడి సమస్త బాధ్యతలూ భగవంతుడే స్వీకరిస్తాడు.

అయితే భక్తి మార్గంలో పురోగమించాలంటే సంసార బాధ్యతలను నెరవేర్చటం కష్టమనీ, అందుచేత సంసారాన్ని త్యజించాలనీ కొందరూ అనుకుంటారు. ఇది నిజం కాదు. మనస్సును భగవంతుడి పాదాలయందు సుస్థిరంగా నిలిపి కూడా మానవుడు తన పనులు తాను చేసుకోవచ్చు. భర్త గ్రామాంతరం వెళ్ళినప్పుడు తన మనస్సంతా ఆయన మీద నిలిపినప్పటికీ పతివ్రత, యింటిపనీ, వంటపనీ సక్రమంగా నిర్వర్తించుకొంటుంది. జనకుడు, అంబరీషుడు, కులశేఖరాళ్వారువంటి రాజర్షులూ, వశిష్ఠుడు, జమదగ్నివంటి బ్రహ్మర్షులూ, త్యాగరాజు, తుకారాం, రామకృష్ణ పరమహంస వంటి మహాభక్తులూ, బహ్మజ్ఞాన సంపన్నులూ దారాపుత్రాదులతో సంసార జీవితాన్ని గడుపుతూనే ముక్తిని పొందటం మనకందరికి తెలిసినదే కదా!

అందువల్ల భగవంతుడి యందు భక్తిని పెంపొందించుకోవటానికి సన్యాస స్వీకారం అవసరం లేదు. కుమ్మరి పురుగు మట్టిలో తిరిగినా దానికి మట్టి అంటకుండా శరీరంపైన జిడ్డులాంటి పూత ఉంటుంది. అలాగే భక్తి జిడ్డు పూసుకుని, సంసారంలో ఎంత స్వేచ్ఛగా సంచరించినా, మానవుడికి సంసారం అంటదు. హిమాలయాలకు పోయి భోజనాన్ని ధ్యానించేకంటే, భోజనం చేసి భగవంతుణ్ణి ధ్యానించటం సులభమూ, ఆచరణీయమూ. శరీరం సంసారంలోనే ఉన్నా, మనస్సు భగవంతుని పాదపద్మముల యందు నిలిస్తే యింకేం కావాలి? అలా మనస్సు భగవంతుడి యందు నిలిస్తే, ఆ భగవచ్ఛక్తియే భక్తుడి సర్వేంద్రియాలను ప్రచోదన చేసి అతని సమస్త బాధ్యతలనూ సమర్థవంతంగా నిర్వహించేటట్లు చేస్తుంది.

ఏ వృత్తిలో ఉన్నవారికైనా భక్తిమార్గం అనువైనదీ, సులువైనది. భగవంతుడు సర్వశక్తికీ మూలాధారం. భక్తుడు బ్యాటరీలో సెల్ లాంటివాడు. మానవుడు కుడిచేతితో తన పనులు చూసుకుంటూ, ఎడమ చేతిని భగవంతుడి పాదాలమీద ఉంచవచ్చును.

ఆ విధంగా భగవచ్ఛక్తి అవిచ్ఛిన్నంగా అతనిలో ప్రవహిస్తూనే ఉంటుంది. తనకు విశ్రాంతి దొరికినప్పుడు ఆ కుడిచేతిని కూడా భగవంతుడి పాదాలమీదనే ఉంచితే బలహీనపడిన బ్యాటరీ తిరిగి ఛార్జి అయి బలాన్ని పుంజుకుంటుంది. ఈ విధంగా భక్తుడు నిరంతరం భగవంతుడితో సంబంధం నిలుపుకోవచ్చు. ఇంద్రియాలు, ఇంద్రియార్థము నందు, మనస్సు పరమార్థము నందు ఉంచినవాడే స్థితప్రజ్ఞుడని గీతాచార్యుడు చెప్పిన మాటలకు అర్థం యిదే.

నామరూప రహితమైన భగవంతుడితో సంబంధం పెట్టుకోవటం ఎలా? సర్వమతాలకూ తల్లివంటి హిందూమతం దీనికొక చక్కటి ఉపాయం సూచించింది. నామరూపరహితమైన భగవంతుడే తన బిడ్డలమైన మనందరిపైన కరుణతో గురుదేవుడుగా మనకు అందుబాటులోకి వస్తాడు. కనుక గురుదేవుడికీ భగవంతుడికీ భేదం లేదు. ఓల్టేజీని వృద్ధి చేసే ట్రాన్స్ఫారమర్ లాంటివారు గురుదేవులు. ఆయన పాదాలను తాకటం ద్వారా పరిమిత శక్తి అయిన నీ ఓల్టేజీని ఆయనతో అనుసంధాన పరిస్తే, నీ అహంకార మమకారాలు ఆయన రెండుపాదాల ద్వారా ప్రవేశించి, భక్తి వైరాగ్యాలుగా మారి, తిరిగి అనంత శక్తితో కూడిన ఓల్టేజీని నీలో ప్రవేశ పెడతాయి. ఈ అధిక ఓల్టేజీ ద్వారా నీలోని జ్ఞాన జ్యోతిని నీవు వెలిగించుకోవచ్చు. ఆ జ్ఞానజ్యోతి వెలుగులో నీకు సత్యాసత్యములు తెలుస్తాయి. సర్వభూతాలలోనూ నిండి, వాటిని ప్రకాశింపజేసే ఏకైక పరంజ్యోతివి, ఏకైక ఆత్మస్వరూపుడివి నీవేనని గ్రహించ గలుగుతావు. అదే ఆత్మసాక్షాత్కారము, అదే ముక్తి.

ఈ ప్రక్రియ అంతా జరగటానికి ఎంత కాలం పడుతుంది? స్విచ్ వేయడం, లైటు వెలగటమూ ఏంత టైమ్ పడుతుందో, అందులో లక్షోవంతు కూడా పట్టదు. శిరస్సు గురుపదాంభోజరుహములకు తాకించిన మరుక్షణమే లోకాలనూ, లోకేశులనూ, లోకస్థులనూ దాటి, అలోకంబైన పెంజీకటి కవ్వల వెలిగే పరంజ్యోతిగా మారిపోతుంది. అందుకే సూరదాసు ఆనందంతోనూ, ఆశ్చర్యంతోనూ 'గురుబిన్ ఐసో కౌన్ కరే?' అన్నాడు.



# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

(14.2.2004 శనివారం. శ్రీ క్షీరా రామలింగేశ్వరాలయం, పాలకొల్లు)

క్షేత్రజ్ఞుడైన శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామివారికి, జగన్మాతకు, శిరసా ప్రణమిల్లుతూ, మీ అందిరలోవున్న ఆ పరబ్రహ్మ వస్తువుకు ప్రణమిల్లుతూ..... ఈ సత్సంగ సమావేశాల రెండవ రోజులోనికి అడుగుపెట్టాం. సద్వస్తు విచారణ చేసుకునే సేవా భాగ్యాన్ని ప్రసాదించాడు పరమశివుడు. కొండంత దేవుడికి కొండంత పత్రి తేగలమా?



లక్షలు ఆస్తి వున్నవారు ధన సహాయం చేయవచ్చు. కానీ ధనాదులతో మనకి, భగవంతుడికి కనెక్షన్ లేదు. భగవంతుడు అమూల్యమైన జీవితాన్ని మనకిచ్చినందుకు ఏ విధంగా ఆయనకి సేవ చేసుకోవాలి? భగవానుడు మన నుండి కోరేది కేవలం మంచి మనసు మాత్రమే. అది సంపూర్ణంగా ఆయనకి అర్పించడమే నిజమైన సేవ.

ఈ దేహమనే దేవాలయంలోని దేవుడు ప్రేరణ చేస్తేనే, మనమీ గుడిలోని దేవుడిని సేవించుకోడానికి వస్తున్నాం. ఈ మేనులోని 'నేను' ఏమిటో, అసలు పరమేశ్వర తత్వమేమిటో మనకెలా తెలుస్తుంది? అది తెలిపేవారే సత్య గురుదేవులు. ఆయన నేర్పే విద్య 'బ్రహ్మవిద్య'. ఏది తెలుసుకుంటే ఇక తెలుసుకోవలసినది ఏదీ వుండదో అది బ్రహ్మ విద్య.

చిన్నప్పటి నుండి మనకి అనేక రకాల చదువులు, అనేక గురువులు అలవాటయిపోయారు. ఆ గురువులు నేర్పేవన్నీ లౌకిక విద్యలే. అవి పొట్టకూటికి సాయం చేస్తాయి.

అంతేకాకుండా మన పెద్దలు నేర్పించేవి కొన్ని వున్నాయి. నాయనా! నువ్వు పరీక్షలో బాగా రాయాలంటే వినాయకుడిని కొలవాలి - ఇంకేదో కావాలంటే ఇంకో దేవుణ్ణి ప్రార్థించాలి... ఇలా అనేకానేక దేవుళ్ళని గురించి నేర్పిస్తారు. ఇందరి దేవుళ్ళలో వున్న శక్తి ఒక్కటేనన్నది వారికి తెలియదు!

ఇలాంటివన్నీ విని విని, భగవంతుడిని తన స్వార్థం కోసం వినియోగించుకోవడం మొదలు పెడతాడు మానవుడు. ఆఖరికి బయట విడిచిన చెప్పులని కూడా ఆయన్నే చూసుకోమని చెప్పే ఘనులు లేకపోలేదు. తల్లి తన బిడ్డకోసం ఏ పని చేయదు కనుక? అలాగే ఆ భోలా శంకరుడు కూడా తన భక్తులకై చేయని చాకిరీ లేదు.

ఒక విద్యార్థి పరీక్షల్లో బాగా ప్యాసు అవ్వాలని సరస్వతీ దేవిని ప్రార్థిస్తాడు. ప్రార్థించేశాను కదా ఇక నాపని అయిపోయింది అని, పుస్తకాలు తలక్రింద పెట్టుకుని నిద్రపోతాడు. పరీక్షా ఫలితాలు వస్తాయి. పరీక్ష ఫెయిల్ అయ్యాడు. పోనీలే, వీడు వుత్తమూర్ఖుడు. వీడిని మరొక్క సారి ప్యాసు చేయిద్దామని, వాడికి సహాయం చేస్తుంది అమ్మ. ఈ సారి కూడా వాడు లెక్కచేయకపోతే? అమ్మ మరొక సారి సాయం చేయదు.

ఇలాగే మరొక విద్యార్థి పరీక్షకి వెళుతూ, 'స్వామీ నా చేత ఈ పరీక్ష బాగా చేయించి, ప్యాసు చేయిస్తే నీకు పులిహోర, దద్దోజనం చేయిస్తాను' అని ఆంజనేయ స్వామికి మ్రొక్కుకుంటాడు.

మరుసటి రోజు అతనికి అత్యంత కష్టమైన లెక్కల పరీక్ష. ఆంజనేయ స్వామికి తన మొక్కు మళ్లీ జ్ఞాపకం చేసి, ప్రశ్న పేపర్ చూసేసరికి చాలా తేలికగా వుంటుంది. మూడు గంటల పరీక్షని గంటలోపునే పూర్తి చేసేస్తాడు. "ఓస్! ఇంత తేలిక పేపరు కోసం నేనెంత భయపడిపోయాను! అన్నీ నాకు తెలిసినవే వచ్చాయి," అని భగవంతుడికి కృతజ్ఞత తెలపడం మానేసి, అదంతా తన ప్రజ్ఞే కదా అని ఆనందపడిపోతాడు.

ఇంకా రెండు గంటలు ఏం చేయాలా అని ఆలోచిస్తాడు. పోనీ, రాసినవన్నీ సరిగ్గా వున్నాయో లేదో చూసుకోవచ్చుకదా. అలా కాకుండా, పులిహోరకి, దద్దోజనానికి కావలసిన సరుకుల జాబితా రాయడం మొదలెడతాడు. ఇంతలో టైము అయిపోయేసరికి, తాను రాసిన లెక్కలపేపరు ఈయడానికి బదులు పులిహోర, దద్దోజనం లిస్టు ఇచ్చి, ఇంటికి వెళ్ళి నాన్నగారితో అంతా తన ప్రజ్ఞ వల్లనే పరీక్ష బ్రహ్మాండంగా రాసానని చెప్తాడు.

ప్రశ్న పత్రం చూపమని తండ్రి అడిగితే, అది ఇస్తూ దానితో పాటు క్రిందపడ్డ తన ఆన్సరు పేపర్లని చూసి కంగుతింటాడు! తనకి శక్తినిచ్చిన భగవంతుడిని తన పని తీరగానే నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుందో ఈ కథవల్ల మనకు తెలుస్తోంది.

మన చేష్టలన్నీ ఇలానే వుంటాయి! గుడిలోనికి వచ్చి అభిషేకం ఎంతలో అయిపోతుందని ఆలోచిస్తాం. పరీక్ష పాసవుతే వినాయకుడికి 100 టెంకాయలు కొడతామని మొక్కుకునేవారు కొందరు. ఇన్ని రకాలుగా ఆ దేవుడిని వాడుకుంటున్నాం.

ఉన్నది ఒకే తత్వం అని గుర్తించగలిగిన నాడు మన జన్మకి సార్థకత. దానికి మహాత్ముల వాక్కులు వినాలి. వారు చెప్పినట్టు తు.చ. తప్పకుండా ఆచరించాలి. అప్పుడు ఈ దేహమే దేవాలయమని గుర్తించగలుగుతాం. ఈ దేహంలోనే వుండి దీనిని ప్రకాశింపచేస్తున్న దేవుడే సర్వత్రా నిండి వున్నాడని తెలుసుకుంటాం. ఇది కేవలం సత్య గురుదేవుల నాశ్రయిస్తేనే మనకి లభ్యమవుతుంది.

–సశేషం

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

21-6-1985

భగవంతుడు సత్య గురువుల ద్వారా, ప్రవక్తల ద్వారా తన సందేశాన్ని మానవులకు అందజేస్తాడు. కాని దాన్ని లక్ష్యపెట్టేవాడు ఎవడు? మానవుడు అజ్ఞానం ద్వారా దుష్టసాంగత్యానికి లోబడి, విషయాదులకి దాసుడై, పతనమై భగవంతుని నిందిస్తాడు అన్నారు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ శ్రీబాబు.



ఇంకా మాట్లాడుతూ 'అహం బ్రహ్మోస్మి' అని వేదం చెప్పింది. అంటే నీలోని పరమాత్మని అనుభవ పూర్వకంగా తెలిసికోమంది కాని అర్థం తెలిసికోకుండా దాన్ని పఠించమనలేదు. లక్షలాది సంవత్సరాలు తపస్సు చేసినా అందని ఆ పరమాత్ముడు గజేంద్రునికి సాకారంగా దర్శనమిచ్చి రక్షించి జన్మ జన్మల నుంచి ఆర్జించిన కర్మని హరించి తనలో లీనం చేసుకున్నాడు. మానవుడు తోటి మానవుణ్ణి ప్రేమించలేడు. నా కులంవాడు కాదని అసహ్యించుకుంటాడు. కాని భగవంతుడు అలా కాదు. ఏ జీవుడికి ఎక్కడ ఆపద కలిగినా తెలుసుకుంటాడు. మీ శరీరంలో ఎక్కడైనా సూది పెట్టి గుచ్చితే మీకు తెలియకుండా వుంటుందా?

మీ శరీరమంతా వ్యాప్తమై ఉంటుంది మనస్సు. ఆ మనస్సులో ఏదైనా సంకల్పం కల్గితే దానికి దాసుడవవుతావు. కామక్రోధాది గుణాలలో ఏది ప్రేరేపించినా దానికి దాసుడవవుతావు కదా! నీ మనస్సులో ఏదైనా సంకల్పం కలిగితే వెంటనే నీ బుద్ధీంద్రియము అది దుష్ట సంకల్పం అయితే వద్దని హెచ్చరిస్తుంది. కాని బలమైన మనస్సుకే దాసుడవుతాడు.

మీకొక దృష్టాంతం చెబుతాను. మీకు డ్రింకు సేవించే అలవాటు ఉందనుకోండి. అతని స్నేహితుడు ఒకడు ఆ అలవాటు మంచిది కాదు, అపకారం చేస్తుంది అని హెచ్చరించాడు అనుకోండి, ఇంకొక స్నేహితుడు డ్రింకు నీకు హుషారునిస్తుంది సేవించు, ఫరవాలేదులే అంటాడనుకోండి, నీ క్షేమాన్ని కోరి, నీ కుటుంబ కీర్తి ప్రతిష్ఠను కోరే స్నేహితుడి మాట వింటారా? దుష్ట సాంగత్యము అంటే ఎలా ఉంటుందో తెలుసా? ముందు బీరు చాలా బావుంటుంది అని ప్రారంభిస్తాడు. దీంట్లో నారింజ రసం కలిపి త్రాగితే ఇంకా బాగుంటుంది అని అలవాటు చేస్తాడు. క్రమేపీ విస్కీ త్రాగు ఇంకా బాగుంటుంది అని ఆశ చూపిస్తాడు. విస్కీలో గోల్డ్‌స్పాట్ కలిపి త్రాగితే అమృతం అంటాడు.

ఇది అంటు తామర లాంటిది. దీనినే మొలగజ్జి అంటారు. గోకిన చోటనే గోకమంటుంది. అంటుకుంటే వదిలి పెట్టదు. ఈ విధంగా విషయ వాంఛలకి బానిస అయినవాడు వాటిని వదులుకోగలడా? బ్రేక్‌ఫాస్ట్‌లో ఒక పెగ్గు, లంచ్‌లో రెండు పెగ్‌లు, రాత్రి డిన్నరులో మూడు పెగ్గులు. ఇటువంటి వ్యక్తి డాక్టరు అయితే ఇంక పేషంట్లను ఏం చూస్తాడు? యశస్సు తగ్గిపోయి, శక్తిహీనుడై పతనం చెందుతాడు. ఇట్టి స్థితిలో ఉన్న వ్యక్తికి సజ్జన సాంగత్యం ఎంతో తోడ్పడుతుంది.

బురదలో ఉన్నా కుమ్మరి పురుగు శరీరానికి బురద అంటదు. దాని దేహానికి జిడ్డు ఉంటుంది. అలాగే మానవుడు గృహస్థాశ్రమంలో ఉన్నా భక్తి ద్వారా కలిగే జ్ఞానమనే జిడ్డు కలిగి ఉంటే సంసారంలోని సుడిగుండాలు ఏ రకమైన హానీ కలిగించలేవు. జ్ఞాన జిడ్డు లోపిస్తే మాత్రం ఈ నరపక్షులు నర జలధి అనే భవసాగరంలో మునిగి పోతారు. హంస నీటిలో ఉన్నా దానికి నీరు అంటదు. అది నీటిలో ఈదగలుగుతుంది. కాని ఇంకొక పక్షి ఏదైనా అయితే నీటిలో ఉంచితే చనిపోతుంది.

మజ్జిగలో వచ్చిన వెన్న మళ్ళీ మజ్జిగలో కరగదు. అలాగే గృహస్థాశ్రమంలో వున్నా సజ్జన సాంగత్యానికి అలవాటు పడిన మనస్సు చెదరదు. పాలను కాచి చక్కగా స్థిరంగా తోడుపెట్టి ఉంచాలి. అది తోడుకుంటుంది. అలాగే సాధకుడు కొంతకాలం స్థిరంగా ఒక దగ్గర ఉండి లక్ష్యార్థంపై దృష్టి నిలపాలి అన్నారు శ్రీబాబు.

*

మీ అనుభవాలను మాకు వ్రాసి పంపండి

సమర్థ సద్గురు దేవులైన శ్రీ బాబూజీ మహరాజ్ వారితో, శ్రీ మాతాజీ వారితో మీరు పొందిన అనుభవాలను మాకు పంపితే మేము వాటిని సమర్థ సద్గురు మాస పత్రికలో ప్రచురిస్తాము. మీరు వ్రాసే అనుభవాలు ఆధ్యాత్మిక పరంగా ఉండాలి. అక్టోబర్ 10 వ తేదీ లోపు పంపితే వాటిని నవంబర్ మాస పత్రికలో ప్రచురిస్తాము. త్వర పడండి!

ఎడిటర్
సమర్థ సద్గురు

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

**అక్టోబర్ 2012**

10 బుధ శ్రీగురుదశమి సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ

13 శని శని త్రయోదశి, మాస శివరాత్రి

**<u>16 మంగళవారం నుండి, అక్టోబర్ 26 శుక్రవారం వరకు శ్రీదేవీనవరాత్రోత్సవములు</u>**.

ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామతారక పరబ్రహ్మ ప్రసాద్, మరియు శ్రీవెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీదేవీ భాగవత ప్రవచనము. మధ్యాహ్నము జగన్మాత కుంకుమార్చనలు, హారతి, మంత్రపుష్పము, దర్బారు, భక్త సమారాధన సాయంకాలము 6 గం.లకు ప్రార్థన, 7 గం.లకు జగన్మాత సాయంకాల పూజ, తీర్థ ప్రసాదములు.

16 మంగళ ఉ॥6-30ని॥ శ్రీమాతాజీవారి శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా దీక్షా స్వీకారము

17బుధ నుండి 24 బుధ వరకు ఉ॥ 9గం.ల నుండి ఆధ్యాత్మిక ప్రవచనములు, శ్రీమాతాజీవారి అనుగ్రహభాషణము, మరియు ఆశ్రమ భక్తుల ఆధ్యాత్మిక ప్రసంగములు, శ్రీ గురుదేవుల దివ్య దర్శనము,బోధ (వీడియో), శ్రీబాబూజీ మహరాజ్ వాడినవస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్ధగంట).

20 శని మూలా నక్షత్రం.

21 ఆది సరస్వతీ పూజ, శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

22 సోమ దుర్గాష్టమి

23 మంగ మహర్నవమి. శ్రీ జగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

24 బుధ విజయదశమి, నామకరణములు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసములు.

25 గురు ఏకాదశి, ఏకాహం, దీక్షావిరమణ, పూజాక్షతలు శ్రీమాతాజీ భక్తులపైన చల్లుతారు,రాత్రి 7 గం.లకు జగన్మాత ఊరేగింపు.

26 శుక్రవారం రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

27 శని శని త్రయోదశి.

29 సోమ పూర్ణిమ, శ్రీమాతాజీవారి 58వ జన్మదినోత్సవము,శ్రీ సద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన.

**నవంబరు 2012**

9 శుక్ర గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

12 సోమ నరక చతుర్దశి, మాస శివరాత్రి,ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

13 మంగ దీపావళి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన, రాత్రి 8 గంటలకు టపాసులు పేల్చుట.

16 శుక్రవారం నుండి నవంబర్ 24 శనివారం వరకు ప్రతి రోజు ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో నవ రసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన.

17 శని నాగుల చవితి

25 క్షీరాబ్ది ద్వాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

28 బుధ గురుపూర్ణిమ, శ్రీ గురునానక్ జయంతి,సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన, సాయంకాలం -జ్వాలా తోరణం, శ్రీకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వరుల నగరోత్సవం

## చాతుర్మాస్య సందర్భంగా ఆధ్యాత్మిక ప్రవచనం చేసిన వారి వివరములు

జూలై 2012

4-10 పూజ్య శ్రీ దండి నిర్మలానందగిరి స్వాములవారు (అష్టలక్ష్మీ పీఠం, తెనాలి)

ఉ. 10 - 11 గం॥ల వరకు - అపరోక్షానుభూతి సా.6 - 7 గం॥ల వరకు - స్థిత ప్రజ్ఞ్ఞుని లక్షణాలు

11-17 శ్రీసుందరకాండ సత్యన్నారాయణగారు, సిద్దిపేట - సుందరకాండ,

ఉదయం 10 - 11 గం॥ల వరకు- , తిరిగి సాయంత్రం 6 - 7 గం॥ల వరకు

18-24 సా. 6 -7 - శ్రీ వెంకటరమణ ప్రసాద్ గారు, శ్రీ కాళీవనాశ్రమం - బాలకాండ.

25-31 " " శ్రీ పరాశర ప్రసాద్ గారు, శ్రీ కాళీవనాశ్రమం - గురు లక్ష్యార్థసిద్ధి.

ఆగస్ట్ 2012

1-7 సా. 6 -7 శ్రీ కామేశ్వరి ప్రసాద గారు,శ్రీ కాళీవనాశ్రమం - యోగవాసిష్టం.

8-14 " " శ్రీ సుషుమ్న ప్రసాద గారు,శ్రీ కాళీవనాశ్రమం - యోగవాసిష్టం.

15-21 " " శ్రీ రమణ ప్రసాద్ గారు,శ్రీ కాళీవనాశ్రమం - భక్తి తత్త్వం.

22-28 " " శ్రీతారక పరబ్రహ్మ ప్రసాద్‌గారు,శ్రీ కాళీవనాశ్రమం- త్రిపురారహస్యం.

29-4 సెప్టెంబర్ సా. 6- 7శ్రీ జపమాల ప్రసాద్ గారు,శ్రీ కాళీవనాశ్రమం -

-గుణత్రయ విభాగయోగం (భగవద్గీత)

సెప్టెంబర్ 2012

5-11 సా. 6-7 శ్రీ అశోక్ ప్రసాద్ గారు, శ్రీ కాళీవనాశ్రమం - వేదాంత పంచదశి -మహావాక్య ప్రకరణం.

12-18 ఉ. 10 -11 ది.12 -13 శ్రీ మహాలక్ష్మి(సిరిపురం), శ్రీ సన్నిధానం కాళీమాత గారు.

ది.14-15 శ్రీ సుశీల ప్రసాదగారు, శ్రీ అరుంధతిగారు.

ది.16 శ్రీజానకిరామ శాస్త్రిగారు, శ్రీ సుశీలగారు.

ది.17 శ్రీ కొండ కాళీమాత గారు, శ్రీ వి.సుశీల గారు.

ది.18 శ్రీ కుమార స్వామి రాజా గారు, శ్రీ కోమలి గారు.

12-18 సా. 6 -7 పూజ్య శ్రీ మాతాజీ, శ్రీకాళీవనాశ్రమం - శ్రీ సద్గురు పాదుకాస్తవం.

19-21 " " శ్రీ సంపత్ గారు - పెరియ పురాణం (శివ భక్తులచరిత్రలు)

22 సా. 6 - 6.30 శ్రీ సంపత్ గారు 6.30 - 7 శ్రీ కొండ కాళీమాతగారు

23 " " " " 6.30 - 7 శ్రీ లక్ష్మి గారు (ఆర్.టి.సి).

24 " " " " 6.30 - 7 శ్రీ కొండ వెంకట్రాజు గారు.

25 - 28 సా. 6- 7 శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ గారు - మోక్ష కారణసామగ్ర్యాం భక్తిరేవ గరీయసీ

# దారి తప్పిన భక్తుని భగవంతుడు రక్షిస్తాడు

-సుషుమ్న ప్రసాద

తాత్కాలికంగా ప్రాపంచిక విషయలోలుడైన భక్తుడను కూడా భగవంతుడు తప్పక రక్షిస్తాడు. విప్రనారాయణుడు శ్రీరంగములో కొలువైన శ్రీరంగనాధునికి అత్యంత ప్రియతమ భక్తుడు. ఈ సత్యం విప్రనారాయణ జీవితములో ఋజువై, అతడు చివరిగా ఆళ్వారు స్థితికి ఎదిగాడు.

తమిళనాడులో ప్రస్తుత కుంబకోణం సమీపాన ఉన్న 'మందంగుడి' అనే గ్రామంలో ఒక సదాచార బ్రాహ్మణ కుంటుంబమున విప్రనారాయణుడు వుద్భవించాడు.అతడొకసారి శ్రీరంగం వెళ్ళి అక్కడ దివ్యసౌందర్యంతో, వైభవంతో విరాజిల్లే రంగనాధ స్వామిని దర్శించి, తక్షణమే ఆ స్వామికి పరమభక్తుడయ్యాడు. అక్కడ సమీపాన ఉన్న పవిత్ర ప్రదేశంలో తన నివాసమేర్పరచుకుని, నిత్యమూ స్వామివారికి పుష్పకైంకర్యం చేసేవాడు.అందుకోసం కావేరీ తీరంలో ఒక చిన్న పుష్ప వనాన్ని పెంచాడు. అందులో రకరకాల రంగుల పరిమళభరితమైన పూలమొక్కలను, తులసి మొక్కలను వేసి, శ్రద్ధతో పోషించాడు. ఆ పుష్పాలనుకోసి, మాలలను కట్టి స్వామివారికి కైంకర్యం చేసేవాడు.

విప్రనారాయణడు సదా తాను రచించిన భక్తిగీతాలను ఆలపిస్తూ గంభీరంగా ఉండేవాడు. ఆయన అచంచల భక్తికి, ప్రజలదరూ గౌరవించేవారు. భగవంతుని విషయం తప్ప, తదితర ఆలోచనలేవీ, అతని మనసులో ప్రవేశించేవి కావు. తిరుపల్లి సుప్రభాతము, తిరుమాలె (భక్తిమాల) అనే రెండు గ్రంథములను రచించాడు. ఆ రెండు రచనలు తరువాత చాలా ప్రసిద్ధమై, నాలాయిర దివ్యప్రబంధములో శ్రీ మహావిష్ణువును స్తుతించే నాలుగువేల భక్తిగీతాలలో చోటు చేసుకున్నాయి.

ఇది యిలాఉండగా, ఒకరోజు ఆ ఊరిలోని ప్రసిద్ధ నర్తకి దేవదేవి తన చెలికత్తెతో ఆ పూలతోటవైపు వెళ్ళటం తటస్థించింది. ఆ వనంలోని అందమైన పూలను చూసి ఆకర్షింపబడి, ఆ పూలను కోద్దామని ప్రయత్నించింది. అక్కడ సమీపంలోనే వున్న విప్ర నారాయణుడు ఆ దృశ్యం చూసి కోపించి, ఆ పుష్పాలు భగవంతుని ఆరాధనకే తప్ప యితర మానవుల అలంకారానికి కాదని మందలించాడు. దేవదేవి క్షమార్పణ కోరి నిష్క్రమించింది. అక్కడ నుంచి తిరిగి వెళ్ళిపోతూ, తన చెలికత్తెను అతని వివరాలను గూర్చి ప్రశ్నించింది. ఆ చెలికత్తె విప్రనారాయణుని ప్రశంసిస్తూ, భగవంతునిపట్ల భక్తితో పరవశించటం తప్ప ఏ యితర విషయవాంఛలు లేవని చెప్పింది. వెంటనే దేవదేవి విప్రనారాయణుని తన వశం చేసుకుని, భగవంతుని విస్మరించేటట్లు చేస్తానని ప్రతిజ్ఞ చేసింది.

కొన్ని రోజుల తరువాత దేవదేవి సన్యాసి వేషధారణ చేసి, విప్రనారాయణుని వద్దకు వెళ్ళి వారిపూల తోటలో పూలు కోసినందుకు క్షమించమని కన్నీరు కారుస్తూ, యిలా మాట్లాడింది " అయ్యా! నేను చేసిన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా మీకు సేవ చేస్తాను. శ్రీరంగనాథస్వామిపై మీకున్న భక్తిప్రపత్తులు నన్నెంతో ముగ్ధురాలిని చేశాయి. ఇక మీదట మీ పుష్ప కైంకర్యసేవలో నేనూ పాలుపంచుకుంటాను. ప్రతిరోజూ పూలమొక్కలకు నీరుపెట్టి, పూలు కోసి, మాలలుకట్టి మీకు సహాయం చేస్తాను. నన్ను మీ శిష్యురాలిగా స్వీకరించండి. మీరు స్వామి మహిమను భక్తిభావ భరితమైన కీర్తనలతో స్తుతిస్తుంటే విని ఆనందించే భక్తురాలిగా నా శేషజీవితాన్ని గడుపుతాను".

ఆమె పశ్చాత్తాపాన్ని నిజమని నమ్మి అమాయకుడైన విప్రనారాయణుడు ఆమె విజ్ఞప్తిని మన్నించి, ఆ పుష్పవనంలో తన శిష్యులకని కేటాయించిన కుటీరంలో వుండటానికి అనుమతించాడు.

దేవదేవి తన నిత్యసేవా కైంకర్య చర్యలనెంతో సమర్థవంతంగా నిర్వహిస్తూ విప్రనారాయణుని విశ్వాసాన్ని చూరగొంది. శ్రీరంగనాథ స్వామి కథలను కీర్తిస్తూ, వర్ణిస్తుంటే తన శిష్యులతోపాటు ఆమె చూపే శ్రద్ధాసక్తులకు అతనెంతో ముగ్ధుడయ్యాడు. ఇలా రోజులు గడిచిపోతున్నాయి. విప్రనారాయణుని తన వశీకృతం చేసుకునే అవకాశానికై వక్రబుద్ధితో దేవదేవి ఎదురుతెన్నులు చూస్తోంది.

వర్షఋతువులో ఒకరోజు రాత్రి జోరుగా వర్షం కురుస్తుంటే, విప్రనారాయణుని కుటీరం ద్వారం కొట్టిన శబ్దం విని వెంటనే ఆయన ద్వారం తెరిచేటప్పటికి దేవదేవి పూర్తిగా తడిసి, ముద్దయి వణుకుతూ కనిపించింది. ఆమె పట్ల సానుభూతితో లోపలకు రమ్మనమని ఆహ్వానించి, పొడివస్త్రమునిచ్చి, ధరించమన్నాడు. ఆమె పక్కనున్నగదిలోకి వెళ్ళి పొడివస్త్రాలు ధరిస్తుండగా, విప్రనారాయణుడు ఆమెవైపు చూడటం తటస్థించింది.

ఒక తృటికాలంలో శిల్పంలా మలచి ఉన్న ఆమె సౌందర్యాన్ని చూసి ముగ్ధుడై ఆమె వ్యామోహంలో పడ్డాడు. అనతి కాలంలో ఆమె సౌందర్యానికి దాసోహమని, నిరంతరమూ ఆమె పొందుకోసం పరితపించాడు. అలా దేవదేవి తన ధ్యేయాన్ని నెరవేర్చుకొని, విప్రనారాయణుని తన వశీకృతునిగా చేసుకుంది.

– సశేషం

# గురు కృపా హి కేవలమ్

గత సంచిక తరువాయి

- రమణ ప్రసాద్

గురుకృప అందరిపైనా సమానంగావర్షిస్తుంది. దానిని గుర్తిస్తే ఆనందం కలుగుతుంది. ఏ సమయంలో ఎవరిని రక్షించాలో అది గురుదేవుల ప్రణాళిక ప్రకారం జరుగుతుంది. శ్రీ మాతాజీ హైదరాబాద్‌లో మందిర నిర్మాణం సందర్భంగా అక్కడికి వెళ్ళారు. అక్కడ పనులు ముగించుకొని సెప్టెంబర్ 5 వ తారీకున ఆశ్రమానికి రావాల్సిఉంది. కాని శ్రీ మాతాజీ 2వ తారీకు సాయంత్రానికి ఆశ్రమానికి చేరుకొన్నారు. ఆశ్రమంలో తొమ్మిదేళ్ళ బాలిక తీవ్రమైన రోగంతో బాధ పడుతూ శ్రీ మాతాజీ దర్శనంకోసం ఆరాట పడుతోంది.అటు మాతాజీ వచ్చిన సమయానికి ఆ బాలిక మనః ఫలకంలో మాతాజీని దర్శించి ఎంతో ఊరటను పొందింది. ఆ రాత్రి మాతాజీ వచ్చి ఆ బాలికను పలకరించి తీర్థం ఇచ్చారు.ఆ బాలిక గురు సాయుజ్యాన్ని పొందింది.

ఆ మర్నాడు సభలో శ్రీ మాతాజీ మాట్లాడుతూ ఆ పాపను గురించి ఇలాఅన్నారు:

"శ్రీగురుదేవుల దృష్టిలో పడినవాడెవడైతే ఉంటాడో వాడు ఎక్కడికి వెళ్ళినా తిరిగి గురుదేవులవద్దకు రావాల్సిందే. 'నాదృష్టిలో పడినవాడు నా నుంచి తప్పించుకోలేడు. నేను కామావరపుకోట జీడిని' అనేవారు గురుదేవులు.ఎటువంటి అభయమండీ అది! అది చాలదా మనం తరించటానికి. అటువంటి గురు చరణారవిందములు మనకు లభించాయి. అది మన భాగ్యం. అటువంటి గురుదేవుల పాదాల చెంత ఉండటం ఎంత అదృష్టమో!

కాలగమనంలో మనం చేసిన కర్మల ఫలితంగా జన్మకు వస్తాం. ఇది మన ప్రారబ్ధకర్మ. దీనిని అనుభవించాల్సిందే. ఉన్నంతవరకు సుఖాలు పొందాలని చూస్తాము. కాని మనం గతం లో చేసిన పుణ్య పాపాల వల్ల వచ్చే వాటిని అనుభవించాల్సి ఉంటుంది.కాని మనం చేసిన సుకృతం వల్ల శ్రీగురుదేవులు మనలను జ్ఞానమార్గంలో దివిటీ చూపిస్తూ నడిపిస్తున్నారు.

అదే విధంగా చిన్ని పాప! పేరేమో కాళీ లీలా ప్రియ. నా ఫ్రెండు. ఆ పాపకు నేను ఫ్రెండుని. మా ఇద్దరి పరిచయం అలా అయింది. ఆ పాపకు తొమ్మిదవ ఏడు వెళ్ళి మొన్ననే పదవ ఏడు వచ్చింది. చూడండి, పిల్లలు అల్లరి చేయటం వారి స్వభావం. ఆడుకోవటం వారి స్వభావం. దేశ విదేశాలనుండి పిల్లలు వస్తారు. ఎవరి వయస్సు వారితో వారు ఆడుకోవాలని చూస్తారు. చిన్నప్పటినుంచి నాకు ఎందుకండీ ఇంత కడుపు నెప్పి, తలనెప్పి, వాంతులూ అంటే అది నా ఖర్మ.దానిని అనుభవించటానికి శక్తి కూడా అక్కడినుంచే వస్తుంది. ఆ పాప కట్టమూరు వెంకట్రావు గారి మనవరాలు (అమ్మాయి కూతురు). అల్లుడి పేరు సుధాకర్. ఈపాప వారి రెండవ పుత్రిక.

ఏదో ఒక కారణం లేకపోతే కార్యం ఉండదు కదా. ఆ పాపకు అంత చిన్న వయస్సులో ఒక వ్యాధి వచ్చింది. 'వ్యాధి రూపేణ సంస్థితా'. ఆ మహాత్ముల పాదాలుచెంత చేరాక 'ఇది వచ్చేది పోయేది' అని తెలుసుకొన్నాం. కాని ప్రజ్ఞ వచ్చి పోయేది కాదు.అది

ఎంతవరకు తెలుసుకొన్నాం? తెలుసుకొంటే మనకి దాని మీద మమకారం ఎందుకు వస్తోంది? మోహం ఎందుకు వస్తోంది? ఆ మాట ఎవరైనా అడిగితే కోపం వస్తోంది.

భోజనం చేసేటప్పుడు సత్సంగం చేస్తూ, భగవద్విషయాలు మాట్లాడుకుంటూ తింటే, అది వంటికి బలం పడుతుంది. అలాకాకుండా టీ.వీ చూస్తూ, ఆహారం తీసికొంటే వాడి బ్రతుకు ఏమైపోతుంది? అందులో చూసిన సన్నివేశాలకు బి.పి వస్తుంది. డాక్టరు దగ్గరకు వెళ్తావు. ఆయన "నువ్వు ఎం చేస్తూ భోజనం చేశావు? అని అడుగుతాడు.

విచిత్రమైన ఈ జీవితం ఎలా గడుస్తోందో చెబుతున్నాను.మన ఆశ్రమం పెద్ద ఈగల భరిణే. దానిని సీతాకోక చిలుకను చేయగల సమర్థత గురుదేవులకేఉంది. అయితే అది తేనెటీగ అయి ఉండాలి. ఆ తేనెను సేకరించుకోవాలని గురుదేవులు మనకు చేసిన ఏర్పాటు ఉన్నదే.ఆ ఏర్పాటులో మనం మధన పడుతున్నాం.

అనుకోకుండా ఇంకొక తేనెటీగ వచ్చింది. అది చాలా చిన్నముండ. వ్యాధి రూపేణ సంస్థితా – ఏదో అనుకోని ఒక వ్యాధి సంక్రమించింది. ఆ వ్యాధికి భయపడుతూ తల్లి తండ్రులు ఆ పాపను ఇక్కడికి తీసుకువచ్చారు. హాస్పటల్‌లో కూడా చూపించారు. డాక్టర్లు చేసేవి చేస్తున్నారు. కాని వారు తీసుకున్న నిర్ణయం ఏమిటంటే – వస్తే ఇక్కడికి రావటం, వెళ్తే హాస్పటల్‌కి వెళ్ళటం. 'ఋణానుబంధ రూపేణ పశుపతి సుఖాలయా' కొంత ద్రవ్యం ఖర్చు కావాల్సి ఉంది. అలా వెళ్తూ, వస్తూ ఉన్నారు. ఆ పాప ఎక్కడా ఆటలకు మరగలేదు. మంచి మంచి మాటలు చెబుతుంది. సరే నాకు ఫ్రెండ్ అనే ముద్ర పడింది కదా. కాని తండ్రి ఆ పిలుపును మార్చాలని చూశాడు 'మీరు మాతాజీ కదా.మీరు మా గురుదేవులు. ఫ్రెండ్ ఏమిటమ్మా? అని బాధ పడేవాడు. పేరు ఏదైతే ఏమిటట? ఫ్రెండ్ చాలా గొప్ప వర్డ్(మాట). బంధువులు కూడా చేయలేని పని ఫ్రెండ్ చేస్తాడు. అసలు మన రియల్ ఫ్రెండ్ ఎవరు?శ్రీ గురుదేవులు, బాబూజీ. అర్జునుడు మంచి ఫ్రెండ్‌ను పట్టుకొన్నాడు. అయనే జగద్గురువైన శ్రీ కృష్ణుడు. మనం అటువంటి ఫ్రెండ్‌ను పట్టుకొన్నాం. ఆ పాపకు అట్లాగే అలవాటు చేశాను. ఈ పాప హాస్పటల్‌లో అందరూ ఆశ్చర్యపోయేటట్లు బాబూజీ మహారాజ్ గురించి చెప్పేది. ఫ్రెండ్ గురించి చెప్పేది. ఫ్రెండ్‌కి కూడా తెలియదు అంత ఉంది అని.దానికి తెలుసు ఫ్రెండ్ తనను ఎప్పుడూ విడిచిపెట్టదని. ' నా ఫ్రెండ్ నాతో ఉంది' అనేది. ఏదైనా వస్తే ' నా ఫ్రెండ్‌తో చేబుతాను' అనేది. ఇలా నవ్వుతూ, కవ్విస్తూ ఉండేది. ఎవ్వరూ ఈ పాపను పేషెంట్ అనుకొనేవారు కాదు. ఈ పాపను నా ప్రక్క నిలబెట్టుకొనేదాన్ని. దానిని బట్టి ఆ పాప చాలా మందికి తెలుసు.

నేను హైదరాబాద్‌లో జరిగే మందిర నిర్మాణపు పనుల సందర్భంగా అక్కడికి వెళ్ళాను. ఆ పాపకు ఆరు నెలలనించీ వినికిడి పోయింది.ఎక్కువగా మాట్లాడేది కాదు. సైగలు చేసేది. వినిపించటం తగ్గాక మూడు నెలలు మౌనంగా ఉంది. చాలా తక్కువ మాట్లాడేది. టీ.వీ చూసేది కాదు. ఇప్పటి తల్లులు పసిపిల్లలను ఒళ్ళో పడుకోబెట్టుకుని టీ.వీ చూస్తూ పాలు పడుతుంటే, తల్లితోపాటు తలత్రిప్పి టీ.వీ చూస్తారు. టీ.వీ ఆపితే ఏడుస్తారు.

ఆ పాపకు పదేళ్లు. టీ.వీ తెలియదు. సినిమా తెలియదు. మరి గురుదేవులు ఎందుకు తెచ్చుకున్నారో వారికే తెలియాలి. నేనైతే ఆ పాప 'యోగ భ్రష్ట' అని అంటా. యోగభ్రష్టురాలై ఈ జీవితానికి వచ్చి, ఉన్న కర్మలను గబ గబా అనుభవించింది. సంతోషంగా అనుభవించింది ఆడుతూ, పాడుతూ.

నేను కూడా పాపకోసమే బయల్దేరి ఆశ్రమానికి వచ్చాను. పాపను పలకరించి తీర్థం ఇచ్చాను. కాళీ లీలా ప్రియ అని పేరు పెట్టించుకున్నందుకు లీలగా బాబూజీ ఆ రాత్రి తమలో చేర్చుకున్నారు.

తన తల్లి, తండ్రులతో మాట్లాడుతుంటే ఫ్రెండ్ గురించే ఎప్పుడూ మాట్లాడేది. ఆ రాత్రి కూడా 'ఫ్రెండ్ వచ్చింది. నాదంతా పోయింది. నా కేమీ లేదు. నేను లేచిరానా' అని ముద్దు ముద్దుగా ఏకపాత్రాభినయంతో(వాళ్ళ మాటలు తనకు వినిపించటంలేదు కదా) అంది. ఆఖర్లో స్వామి తన సన్నిధిలోకి తీసుకున్నారు. బాబూజీ చెబుతూ ఉంటారు. ఏదో ఒక కారణం ఉండాలి. ఆ కారణం ఆ పాపను ఇలా తీసుకు వచ్చింది.తల్లి తండ్రులకైతే చాలా బాధగా ఉంటుంది. కాదనను. కాని, ఈ రీతిగా పిల్లలు ఎవరైనా ఉన్నారా? ఆ పాప అన్నదట. 'నేను ఎప్పుడో వెళ్ళిపోయేదాన్ని. నన్ను బాబూజీ ఎందుకు ఉంచారంటే మీరు (తల్లి తండ్రులు) నా సేవ చేసుకోవాలని. మీరు నా సేవ చేసుకోండి.'

రోజూ ప్రసాదం పంపేదాన్ని. 'అన్నీ తినొచ్చు. కొంచెం కొంచెంగా తీసుకో' అన్నాను. ప్రసాదం చాలా ఇష్టంగా తినేది.ఒకరోజు దానికి అనుమానం వచ్చింది. . 'నా ఫ్రెండ్ ఒకసారే ప్రసాదం పంపుతుంది. ఇది ఎందుకు తీసుకున్నావు?' అని అడిగింది. ప్రసాదం పట్టుకొనివెళ్లిన సాయి 'ఇప్పుడే ఫోన్ చేశారు,చాకలేట్ ఇచ్చారు' అంటే కొంచెం కొరికి దాచుకొంది. అంతా తినేశాక ఆ కాగితం తండ్రికి పారెయ్యమని ఇస్తే అక్కడే పారేశాడట వాళ్ళ నాన్న . అది చూసి ' ఏయ్! ఇది అశ్రమం.మనకి బాబుగారు ఉండటానికి ఇచ్చారు. కాగితం అక్కడ పారేశావేమిటి? బయట పారెయ్యి' అందట.

ఏమండీ! ఇలాంటిమాటలు మనం మామూలు వాళ్ళ దగ్గర చూస్తామా? ఆ పాప వెళ్ళిపోయిన తర్వాత కూడా సమాధి స్థితిలో ఉన్నట్లే ఉంది.బాబూజీ తనలో చేర్చుకున్నారు.

చిన్నప్పుడు నా ప్రాణం పోతే నాకు ప్రాణం పోశారు ఇప్పటికీ నన్ను ఇలా పెంచుతున్నారు. పాపం ఆ పిల్ల చిన్న ముండ. ముండ అంటున్నాను అని వేరుగా అనుకోవద్దు. ముండ అమ్మ నామాలలో ఒకటి. ఎంత అదృష్టమో! అటువంటి పిల్లకు బీజాన్ని ఇచ్చిన తండ్రీ, నవమాసాలు మోసి కన్న ఆ తల్లీ ఎంత అదృష్టవంతులో. వారు ఆ పిల్లకు సేవ చేసుకున్నారు. భగవంతుడు ఆ రూపంలో చేయించుకున్నాడు.

ప్రతి విషయాన్ని మనం ఆనందమకరందంగా మలుచుకుంటే ఉన్నదంతా అమృతమే. మృతం ఎక్కడ ఉంది? అంటే అమృతంలోనే ఉంది. నీ మృతమైన దేహాన్ని చూస్తూ ఏడుస్తుంటే నీకు అదే అర్థమవుతుంది. కాని దానిని దాటితే ఉన్నది అమృతం.మనం

అమృత స్వరూపులం. గురుదేవులు అమృత స్వరూపులు. వారి తత్త్వం అమృతమయం. ఆది మధ్యాంత రహితుడు భగవంతుడు. సృష్టి అది మధ్యాంతములతో కూడి ఉంది. సృష్టికి అతీతంగా ఉన్నది గురుదృష్టి. ఏమి భాగ్యమండీ. ఎన్నేళ్ళు బ్రతికితేనేం. కాని బ్రతుకును వెలితి చేసుకోవద్దు. ఈ జీవితం వారే నడిపిస్తున్నారు. పార్థుడు అనే రథానికి సారధి పరమాత్మ.మనం పృథ్వితో కూడిన పార్థులమే. మన సారధి గురుదేవులు. కనిపంచని అవ్యక్తమైన శక్తి మనలను నడిపిస్తోంది. కాబట్టి ఆధ్యాత్మ జిజ్ఞాసతో మనమందరం ఆత్మ విద్యను చేపట్టి నిరంతరం ఆ స్థితిని పొందే ప్రయత్నం చేద్దాం.ఇటువంటి అలౌకిక భావాన్ని మనందరికీ అందించింది ఆ పాప.

ఆ తల్లి, జగన్మాత, ఆ కుమారి,ఆ కన్యకా పరమేశ్వరి ఈశ్వరునికోసం తపస్సు చేసి ఈశ్వరునిలో లయం అయింది.

ఆ పాపకు ఆత్మ శాంతి, ఆ పాప తల్లి తండ్రులకు ఆత్మ శాంతి, మనస్థైర్యం శ్రీ గురుదేవులు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

అటువంటి శక్తిని,మనఃస్థైర్యాన్ని, ఆత్మశక్తిని, ఆ పాపకు గురు సాయుజ్యముక్తిని మనందరికీకూడా అట్టి స్థితిని శ్రీ గురుదేవులు ప్రసాదించెదరుగాక! మన మనస్సును ఆత్మలోచేర్చి మన ఆరాధ్య దైవమైన శ్రీ గురుదేవులను వారికి ఆత్మ శక్తిని, మనఃశాంతిని, మనందరికీ దృఢభక్తిని  ప్రసాదించమని శ్రీ గురుదేవులను ప్రార్థిస్తూ , హరిఃఓం.



# శ్రీకృష్ణ కర్ణామృతం

– సుశీలా ప్రసాద

24 శ్లో॥ శిశిరీ కురుతే కదాను నశ్శిఖి పిఞ్ఛ భరణశ్శిశుర్దృశోః।
యుగళం నిగళ న్మధు ద్రవస్మిత ముద్రా మృదునా ముఖేన్దునా ॥

తాత్పర్యము –

నెమలిపింఛమే ఆభరణముగా దాల్చిన బాలుడు, తేనెలొలుకు చిరునగవుతో కూడిన ముఖముతోనెప్పుడు నా కన్నులు చల్లబడునట్లు కనిపించునో!



"తెల్లగా తెల్లవారిపోయింది. వెలకువ రాలేదు. ఇదేంమాయో!" ఉలికిపడుతూ పరుపు మీద నుంచి లేవబోతున్న తల్లి మెడలో హారాలు చేతితో పట్టుకుని నిద్రపోతున్న పసివాడు కదలిపోయి లేచిపోయాడు. "ఇప్పటికే ఆలస్యమైందని తొందర పడుతుంటే నువ్వూ లేచావా నాయనా! ఇహ పనులైనట్లే" అంటూ వాడిని చంకనేసుకుని నట్టింట్లోకి వెళ్ళింది యశోదమ్మ.

చిన్న పట్టెమంచం మీద మెత్తని బొంతవేసి వాడిని పడుకోబెట్టింది. అక్కడి నుంచి కనిపిస్తున్న చిన్న వానిని చూసి పెరడు నిండా ఉన్న బోలెడు చెట్లు సంతోషంగా చల్లని గాలులు విసిరాయి. అవి చక్కలిగింతలు పెట్టినట్లుగా పిల్లవాడు కిలకిలా నవ్వాడు.

అప్పుడే కొట్టంలో నుంచి పితికిన గోవుల పాలను చెంబుల నిండా తెచ్చి యిచ్చారు పాలి కాపులు. యశోదమ్మ వెండి కొమ్ము చెంబునిండా నురుగులు తేరుతున్న ఆ గుమ్మపాలు పోసి చంటివాడి నోటికందించింది. కమ్మని పాలను కడుపునిండా త్రాగిన పసివాడు పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. చేతిలో పసిడి గిలక్కాయ పెట్టి "ఆడుకో నాయనా!" అంటూ తల్లి తన పనులలోకి వెళ్ళింది.

పెరట్లో మామిడి చెట్ల చిగుళ్ళు కొరుకుతున్న కోయిలమ్మ కన్నయ్యను చూసి మురిసిపోతూ 'తియ్యగా జోల పాడనా బుజ్జి నాయనా!' అంది గొంతు సవరించుకుంటూ. 'నాకు నిద్రెక్కడితే వెర్రిదానా! పురుషోత్తముడైన నాకెందుకు జోలలు! మీ పవళింపు సేవలు స్వీకరిస్తూ జగత్తును డోలలు ఊగిస్తాను గాని' అన్నట్లుగా తేనెలొలికేలా చిరునవ్వులు పెదవులపైన చిలికిస్తూ కోయిలవంక చూశాడు.

జామచెట్టుమీద ఆరముగ్గిన పండొకటి ఆరగిస్తూ ఎర్రని ముక్కుతో మెరుస్తున్న చిలకమ్మ 'కృష్ణయ్యా! తెల్లవారింది. ఇంక మేము తిండికోసం తిరిగి తిరిగి చూసి వచ్చిన

చిత్రాలన్నీ నీకు చెప్తాను సరేనా!' అంటున్నది. ఇలాగ గోకులంలోని ఆ ఉదయం ఆనందంగా సాగుతున్న ఆవేళ.....

వాకిట్లో నుంచి 'నందరాజా!' అనే పిలుపు వినవచ్చింది. నందుడు ముంగిట్లోకి వచ్చేసరికి 'ప్రభువులకు అడవి లోంచి మేము పట్టు తేనె, చిట్టీత పళ్ళు, చింతగుజ్జు, వెలగపళ్ళు వెదురు బియ్యము అన్నీ తెచ్చాము' అంటూ కొండల్లో తిరిగే కోయదొరలు అవన్నీ అందిస్తూ అంతే కాదయ్యా, ఇదిగో చూడండి! అంటుంటే నందుడు అటు చూశాడు. అది చిన్న నెమలి పిల్ల! కనుల విందుగా ఉంది. 'ఈ నెమలి పిల్లని మా వాడు ఆడుకోవటానికి తెచ్చారా?' అన్నాడు నందుడు పరిహాసంగా. అప్పుడే అక్కడకి వచ్చిన యశోదమ్మ ఎత్తుకుంటే భుజం మీద నుంచి తలపెట్టి చూస్తున్న కృష్ణుడు రెండు చేతులూ నెమలివైపు చాపాడు. తండ్రి మాటలు నిజమన్నట్లు. అందరూ నవ్వుకున్నారు. నెమలి పిల్ల సన్నగా కేక పెట్టింది.

కన్నయ్య పాకటం నుంచి నిలబడటం, ఆపైన బుడిబుడి నడకలు, ఇక తరువాత పట్టుకుంటే దొరక్కుండా పరుగెత్తే దాకా వచ్చేసరికి, నెమలి పిల్ల కూడ నల్లనయ్యతో తిరుగుతూ తిరుగుతూ ఎదుగుతూ వచ్చింది. నెమలిని ముద్దుగా ఒడిలోకి పొదువుకుంటాడు కృష్ణుడు. అపుడు వాని వంటిరంగు, నెమలి కంఠం రంగు ఒకే తీరుగా మెరుస్తుంటాయి. పిల్లవాడు పెరిగిన కొద్దీ యశోదమ్మ పండుగలు ఎక్కువగా చేస్తూ వస్తున్నది.

– సశేషం

1. **శరీరంపైన పుట్టుమచ్చవలె మనస్సు గురుపాదములతో [పరమాత్మతో] కలిసిపోయి ఉండటమే సమాధి.**
2. **గురుకృప వల్ల సాధింపబడనిది లేదు.**
3. **వాచా జ్ఞానంతో వాసుదేవుని దర్శనం కాదు.**
4. **సోమరితనం అజ్ఞాని లక్షణమే.**

– శ్రీ బాబూజీ

# పరిప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

సాధకులకు సందేహాలు కలగటం అతి సహజం. ఆ సందేహాలను మనస్సులోనే గుప్తంగా ఉంచుకొని, సాధన కొనసాగిస్తే, సాధనలో పురోగతి మాట అటుంచి, ధ్యానానికి కూర్చున్న మరుక్షణం ఆ సందేహమే మనస్సుని బాధించక మానదు కదా! అటువంటి సందేహమే కలిగింది ఒక భక్తునికి. భక్తుడు సందేహాన్ని సద్గురుమూర్తికి నివేదించక పూర్వమే, మనస్సులో ఉన్న విషయాన్ని అవగతం చేసుకున్న శ్రీగురుదేవులు ఆ ప్రస్తావన తీసుకువచ్చి, భక్తులకు అందించిన అమృతమే ఈ శీర్షిక అందిస్తోంది.

పూర్ణత్వం అంటే ఏమిటి? పూర్ణాధికారి అంటే ఎవరు? దానిని పొందే అర్హత అందరికీ ఉందా? అనే సందేహాలకు సమాధానంగా శ్రీసద్గురుమూర్తి తమ బోధను అందిస్తూ............

"అది ఎవరో యిచ్చేది కాదు. పొందేది అంతకన్నా కాదు. అది కేవలం సద్గురు అనుగ్రహంతో పొందే అనుభూతి. నీలో ద్వైత భావం ఎప్పుడు నశిస్తుందో అప్పుడు పొందే అనుభూతి. రాగద్వేషాలు, సుఖదుఃఖాలు, నిందా స్తుతులు గుర్తించినంతవరకు ఆ స్థితిని పొందటం అసంభవం. వన్ ప్లస్ వన్ అన్నా, వన్ డిసిమల్ వన్ అన్నా ఒకటి కాదు కదా! ఉన్నదంతా ఒకటే. నాకు భిన్నంగా ఏదీ లేదు అనే భావన కాకుండా అనుభూతి పూర్ణ స్థితి.మనస్సు ఆత్మలో లయమైన స్థితి. అదే ఆనంద స్థితి. సర్వం బ్రహ్మమయం అనే భావన. ఏకాంతంలో సమూహాన్ని, సమూహంలో ఏకాంతాన్ని సృష్టించుకుని, తమలో తాము ఉండగలిగిన స్థితి.



మనల్ని మనం వదలుకోవాలి. మనల్ని మనం ఖాళీ చేసుకోవాలి. నమస్కారాలు, తిరస్కారాలు వారికి అంటవు. వారిది నివృత్తి మార్గము. తమ చుట్టూ ఉన్నవారి సుఖదుఃఖాలకు, ఆనందాలకు స్పందించని పాషాణం కాదు వారి హృదయం. ఉద్వేగం లేకుండా వారు పొందే ఆత్మానందం నుండి వెలువడే ఆధ్యాత్మిక తరంగాలు వారివారి అవసరాలని బట్టి వారిని తాకి, దుఃఖంలో ఉన్నవారిని ప్రభావితం చేస్తాయి.

సత్యశోధన, సత్య సాధన పూర్ణత్వం సాధించటానికి మార్గం. పూర్ణత్వం అనేది అందించేది ఎవరు? అందుకునేది ఎవరు? దానికి ఎవరి కర్తృత్వము లేదు. అది నిశ్చలము, నిరంతరత కలిగిన స్థిర భావన. నిజస్థితిని గుర్తించే ఎరుక. నీవెవరో నీవు తెలుసుకుంటే అది అవగతమవుతుంది.

*

# శివానంద లహరి

-బులుసు మల్లిక్ USA

**గభీరే కాసారే విశతి విజనే ఘోరవిపినే**
**విశాలే శైలేచ భ్రమతి కుసుమార్థం జడమతిః**
**సమర్ప్యైకం చేతస్సరసిజ ముమానాధ భవతే**
**సుఖేనావస్థాతుం జన ఇహ న జానాతి కిమహెూ**

ఈ శ్లోకంలో శంకరులు భక్తుడు తన చిత్తాన్ని భగవదాయత్తమెలా చేసుకోవాలోతెల్పుతున్నారు. పూజకి కావలసిన అసలుసిసలైన పువ్వులేమిటో తెల్పుతున్నారు. పూజ యాంత్రికం కాకుండా సాధకుడెలాంటి జాగ్రత్త తీసుకోవాలో తెల్పుతున్నారు. దీనికే 'చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా' యని కదా వేమన సూక్తి. ఇక్కడ కూడా శంకరులు పూజలో చిత్తానికే పెద్దపీట వేశారు.



ఏమంటున్నారంటే **విశతి** అంటున్నారు. అంటే ప్రవేశిస్తున్నాడట భక్తుడు. దేనిలోకండి? దీనికే గభీరే కాసారే అంటున్నారు. అలా లోతైన చెరువుల్లోకి దూకుతున్నాడటండి. ఈతలో ప్రవేశం లేదు. కానీ నీళ్ళలోకి ప్రవేశిస్తున్నాడు. అదీ చిత్రం. నిజానికి ఆలోచించండి. మనలోకి ప్రవేశించి యున్నట్టి పరతత్వాన్ని పట్టుకోవాలనే ప్రయత్నించాలి గాని, మనం మళ్ళీ వేరే మడుగులోకి దిగడమెందుకు?

అక్కడతో ఆగాడా అంటే విజనే ఘోరవిపినే నిర్మానుష్యమైన కీకారణ్యాలలోకి ప్రవేశిస్తున్నాడటండీ. అడుగువేస్తే భయం. పిలిచినా పలకడానికి సాటిమనిషెవ్వరూ లేనిచోటకి వెళ్ళవలసిన అవసరమేముంది?

అదయ్యాక **విశాలే శైలేచ భ్రమతి** సువిశాలమైన కొండల్ని ఎక్కీ దిగీ కాళ్ళరిగేదాకా పచార్లు చేస్తున్నాడటండి. దేనికంటారా కుసుమార్థం అని చెబుతున్నారు శంకరులు. పూజకి పూలు కావలసి వచ్చాయి. వాటిని తీసుకొద్దామని బయలుదేరాడు. అలసిపోయాడు. నిస్సహాయ పరిస్థితికి లోనయ్యాడు. ఆశయం మంచిదే. అట్టివాడే **జడమతిః** అంటే మందబుద్ధిగలవాడు సుమా యని తేల్చిచెప్పారు శంకరులు.

ఇప్పుడు చూడండి. ఉదయమే పూజలోకి పూలుకావాలని పెరటిలోకెళ్ళి మన చెట్టుకు పూసినపూలకి బదులుగా మన యింటివైపుకి వాలిన పక్కింటివారి మందారచెట్టు కొమ్మకి పూసిన పూలని కోసి భగవంతుడికి అర్పించడమెందుకు? మనకు చెందిన పూలనే యివ్వచ్చుకదా? అంతెందుకు. శంకరులైతే అసలిలా ఎన్నో పువ్వులని కోసుకొచ్చేకంటె ఏకం **చేతస్స రసిజం సమర్ప్య** అని సులువుగా శెలవిస్తున్నారు.

మనకతి దగ్గరలో ఉన్నదటండి. అదే చిత్తమనే సరస్సులో వెలసినట్టి మనసనే ఒకే ఒకచిన్న పద్మము. దానినే సమర్పించవచ్చు కదా.

ఎవరికొరకంటారా? **ఉమానాధం భవతే**. అనగా ఉమాపతి కొరకు. పార్వతీపతి కొరకు. పశుపతి కొరకు. అలా మనస్సుని భవునికర్పించి **పార్వతీపతే హరేపశుపతే గంగాధరా హరగౌరీపతే** అని భజన చేస్తే చాలదూ? అంతకుమించి వేదమప్పచెప్పాలని పరితపించాలా? పురాణం వల్లెవెయ్యాలని చింతించాలా?

చివరిగా శంకరులు **కిమహో!** అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఏమటా విడ్డూరమంటే **ఇహ సుఖేన అవస్థాతుం జన న జానాతి**. ఈ లోకంలోనే మనం శాశ్వతమైన సుఖాన్ని పొందేందుకు సులభమైన మార్గమున్నది కదా. దీనిని గ్రహించకుండా లేనిపోని తిరుగుడు తిరుగుతున్నాడు కదా మందబుద్ధిగల జీవి.

ఇక్కడ ఒక విషయం మనం గ్రహించాలి. పూజకి మనస్సు ముఖ్యము. ఆ కారణం చేతనే శంకరులు ఎన్నో మానస పూజలని మన జాతికందించారు. ఒకచోటైతే త్రిపురసుందరీ అమ్మవారిని ఉద్దేశించి మానసపూజను చేస్తూ **అద్యశక్తేః రుచిర వచన పుష్పైః అర్చనం సంచినోమి** అంటారు. మాటలనే పుష్పాలని నీకోసమై తీసుకువచ్చేనమ్మా. ఇంతకుమించి ఏమి తేగలను? అంటారు. వాగ్దేవి కటాక్షం ఉంది కాబట్టి అలా అనగలిగారు. అలాగని మనం కూడా శ్లోకాలు వ్రాయాలని కాదు. మనస్సుని భగవదర్పణ చేసుకోవడం ముందస్తుగా నేర్చుకోవాలి. అలాగని చెప్పేసి, నిత్యపూజలని మానేయాలంటారా? దీనర్థమది కాదు? పూజంటారా. మనచే శక్తికొలదీ చేయదగిన నిత్యకృత్యం. అందులో లోపముండకూడదు. ఎంచేతంటే? **నానీతా పద్మమాలా సరసి వికసితా గంధధూపైః త్వదర్థం** అనివాపోతారు. శివ అపరాధ క్షమాపణ స్తోత్రంలో ఆది శంకరులు. అంటే పూజకు పువ్వులు కూడా తేవాలి. కాని అప్రక్రియ కూడా పూజనే అయిపోవాలి. చిత్తశుద్ధితో మనం ప్రతిపూజ చేయాలన్నదే శంకరుల నిర్ణయం.

దీనికే యధావాక్కుల అన్నయ్య సర్వేశ్వర శతకంలో **అమితామోద నవప్రసూనముల నిన్నర్చించుచో పద్యములూహించి స్తుతించుచో** అంటూ చివరిగా అందు చిత్తము **సద్భక్తియే నీవు చేకొనుపదార్థంబెల్ల సర్వేశ్వరా** అని అద్భుతంగా చెబుతాడు. భగవంతునికి ఆనందమనే పువ్వులనే అర్పించనీయండి. పద్యమాలల నల్లనీయండి. అంతేకాదు ఫలాల నర్పించనీయండి. ప్రసాదాలు నివేదించనీయండి. ఈశ్వరా వీటన్నిటిలోనూ నువ్వు పుచ్చుకొనే పదార్థాలు కేవలం అందు దాగియున్న చిత్తమూ, సద్భక్తీ తప్ప వేరేమీ కాదుకదా. మరి మనం కూడా యిక్కడ శంకరులు చెప్పినట్లుగా చిత్తశుద్ధితో, అలాగే సద్భక్తితో మనం చేసే ప్రతికర్మని భగవదర్పణం చేసుకుని ఈశ్వర పాదారవిందములను ఆశ్రయిద్దాం. పూజలో సఫలీకృతులమౌదాం. తరిద్దాం!!

గత సంచిక తరువాయి

# స్థిత ప్రజ్ఞస్య కా భాషా?

- రమణ ప్రసాద్

రెండవది నిర్మాణ పద్ధతి -

ఆత్మన్యేవాత్మనా తుష్ట ః। నిద్రలో కోరికలు ఉండవు. స్థిత ప్రజ్ఞుడు ఆత్మానందాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అతడు ఆత్మరతుడు.

విషయాదులలో ఆనందం లేదు. అది షుగర్ కోటెడ్ మాత్ర లాంటింది.

ఇంద్రియాణి పరాణ్యాహుః। ఇంద్రియేభ్యః పరం మనః।

మనసస్తు పరా బుద్ధిః। యో బుద్ధే పరతస్తు సః॥

స్థూల శరీరం కంటె ఇంద్రియాలు బలీయమైనవి. సూక్ష్మం కంటె సూక్ష్మం మనస్సు. మనస్సు కంటె బుద్ధి, బుద్ధి కంటె సూక్ష్మమైనది ఆత్మ. బుద్ధికి అందనిది ప్రజ్ఞ. ఆనందం అక్కడే వుంటుంది. శ్రీకృష్ణ కర్ణామృతంలో ఒక ప్రసంగం వస్తుంది. కృష్ణుడు ఒక గోపిక యింట్లో జొరబడి, వెన్న దొంగిలిస్తుండగా పట్టుబడిపోతాడు.

గోపిక - నువ్వు ఎవరివి?

కృష్ణుడు - బలరాముడి తమ్ముణ్ణి.

గోపిక - ఎందుకు వచ్చావు?

కృష్ణుడు - నా ఇల్లే అనుకుని వచ్చాను

గోపిక - నవనీత పాత్రలో చెయ్యి ఎందుకు పెట్టావు?

కృష్ణుడు - ఆవుదూడ పారిపోయింది. మెత్తగా ఉంటే ఆ లేగదూడ ఇందులో ఉందేమోనని వెతుకుతున్నాను. ఇది మన కథే. అసలైనది లోపల ఉంది. మనం దానిని శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలలో వెతుకుతున్నాము. ఆయన ఎక్కడ ఉన్నాడు? అన్ని ప్రాణులలోనూ వున్నాడు. ఎలా వున్నాడు? ఈశ్వర సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి।

భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా ॥ (18అ - 6శ్లో)

ఆయన ప్రాణులలో హృదయాంతరాళంలో ఉండి తన మాయ.చేత వారి వారి కర్మల ననుసరించి భ్రమింపజేస్తున్నాడు.

మనం తిరుపతి వెళ్తాం. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం గంటలు తరబడి పడిగాపులు కాస్తాం. తీరా దగ్గరకి వెళ్ళేసరికి కళ్ళు మూసుకుంటాం. కళ్ళు తెరిచి చూసే లోపల నెట్టిపారేస్తారు. ప్రత్యక్షాన్ని పరోక్షం చేసుకో. పరోక్షాన్ని అపరోక్షం చేసుకో. దేవుడిని భావన చెయ్యి. కళ్ళు మూసుకుని ఏకాగ్రత చేస్తే ఆ దేవుడు నీలోనే ఉన్నాడని తెలుసుకుంటావు.ఆత్మరతుడు ఆత్మలో క్రీడిస్తాడు. తాను తానై తానుగా ఉంటాడు. మేను కంటె వేరుగా ఉంటాడు. జగత్తు కంటే వేరుగా ఉంటాడు. కాదు కాదు - జగత్తే తానై వున్నాడు. మేనే తానై వున్నాడు. ఇది అనుభవానికి తెచ్చుకోవాలి. ఇది వేందాంతంలో పరాకాష్ఠ. బోధా సౌకర్యం కోసం జగత్తు వేరు, మేను వేరు అని చెబుతారు.

శ్రీగౌడపాదాచార్యులవారు జగత్తు లేనే లేదు అన్నారు. అలా అంటే అర్థం లేదని శ్రీశంకర పాదాచార్యులవారు ముందు జగత్తు ఉంది అని చెప్పి, జగత్తే బ్రహ్మ అని చెప్పారు. కాబట్టి జగత్తు తానే, మేను తానే, ఉండేది బ్రహ్మ మొక్కటే. వుండేది నీవే, నీకంటె అన్యం లేదు. ఉందనుకుంటే దుఃఖమే. మనస్సులోని కోరికలు తొలగిపోయి ఆత్మ యందు సంతుష్టుడైనవాడు పరమాత్మ సంయోగం చేసి. ఆత్మానందం పొందేవాడే స్థిత ప్రజ్ఞుడు.

*

# త్రిపురా (రహస్య) మహాత్మ్యము

– తారక పరబ్రహ్మ ప్రసాద్

ఓం నమః కారణానందరూపిణీ పరచిన్మయీ।
విరాజతే జగత్ చిత్ర చిత్రదర్పణ రూపిణీ ॥
ఓం సర్వ చైతన్య రూపాం తాం ఆద్యాం విద్యాం చ ధీమహి।
ధియో యా నః ప్రచోదయాత్ ॥

శ్రీమాతకు గల అనంత నామములలో 'త్రిపురా' అనునది ఒక విశిష్టమైన నామము. 'త్రిపురా' అనగా త్రిపురములలోను, వానికి ఆవతలను కూడ అనంతముగా ఉన్న శక్తి స్వరూపము. త్రిపురములు అనగా జీవుల యొక్క స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు. వేదాన్త పరిభాషలో 'శరీరము'నకు 'పురము' అను పదము ప్రసిద్ధముగా ఉపయోగించ బడుచున్నది. 'ఆ' అనుపదమునకు (ఇక్కడ ఒక్క అక్షరమే పదము) పార్వతి, అంతటా వ్యాపించునది అను అర్థములను బట్టి 'త్రిపురా' అనగా త్రిపురములలోను, ఆవతలను, అంతటా వ్యాపించి యున్న ఏకైక పరాశక్తి అని స్పష్టమగుచున్నది. పరిపూర్ణంగా సర్వత్ర వ్యాపించియుండు పరాశక్తియే పరమేశ్వరి, పరబ్రహ్మ– స్వరూపిణి, పరమాత్మా అని చెప్పబడుచున్నది. శ్రీదేవీ– ఖడ్గమాలా స్తోత్రములోని శ్రీచక్ర, నవమావరణ, పూజా నామములలోని మొదటి తొమ్మిది నామములు, వరుసగా 1. త్రిపురా, 2. త్రిపురేశి, 3. త్రిపుర సుందరి, 4. త్రిపురవాసిని, 5. త్రిపురా శ్రీః 6. త్రిపుర మాలిని, 7. త్రిపురా సిద్ధే, 8. త్రిపురాంబ, 9. మహాత్రిపుర – సుందరి, అనునవి 'త్రిపురా' శబ్దముతో కూడినవియగుట 'త్రిపురా' పదము యొక్క మహామహిమను తెలియజేయుచున్నవి.



ప్రతి వ్యక్తిలోని మూలశక్తికి 'ఆత్మ' అనియు, సర్వజీవులలనోని మూలశక్తి మొత్తమునకు 'పరమాత్మ' అనియు నిర్వచనములుగా ఉన్నవి. మూలశక్తి స్వరూపమైన 'ఆత్మ', 'పరమాత్మ'లకు ఏవిధమైన వస్తు భేదమే లేదు. కాబట్టి 'పరమాత్మ'ను, పరమేశ్వరుడు అనిగాని, పరమేశ్వరి అనిగాని మనకు యిష్టమైన విధముగా సంభావించ వచ్చును. అందువలన ఆ పరమాత్మశక్తికే, జగన్మాతృభావనతో త్రిపురాంబ, త్రిపురాదేవి, త్రిపురా మహేశ్వరి, త్రిపుర సుందరి మొదలగు నామములు ప్రసిద్ధమైనవి.

అహం (నేను), ఆత్మ (తాను), పరమాత్మ (అందరిలో ఉన్న నేను, తాను, అనుభావము.) అందరికీ తెలిసినట్లుగానే ఉన్నప్పటికీ పండితులనుకొనేవారికి కూడ స్పష్టముగా అనుభవముగా తెలియకపోవుట చేత 'అహంకారము' (మనోభావము)నే 'ఆత్మ'గా భావించి, భ్రాంతిని పొందుచు, అశాంతిని అనుభవిస్తున్నారు. ఆత్మ, అహం, నేను యొక్క సత్య (నిత్య)మైన స్వరూప అనుభవం లేనివారందరును 'అహం' కానట్టి 'అహంకారము'నే 'ఆత్మ'గా భావించుకొని, దానివలన త్రిగుణములతో కూడిన అనేక రకముల అవస్థలను పొందుచు, అనేక జన్మలను పొందుచు శాంతిని పొందలేక పోవుచున్నారు. అహంకారమును విడిచిన మహాత్ములు'ఆత్మ' యొక్క నిజమైన స్థితియైన ప్రశాంతిని అనుభవించ గలుగుతున్నారు.

ప్రతిజీవియు గాఢనిద్రలో, మనస్సు, అందులోని ఒకభాగమైన అహంకారము పనిచేయకపోవుట వలన, ప్రశాంతిని కొంతసేపు అనుభవించ గల్గుతున్నారు. కాని, స్వప్నములోను, మెలకువలోను మనస్సు ఆలోచనలను ఆపలేకపోవుట వలన ప్రశాంతి కలుగక అశాంతి కలుగుతున్నది. అందరూ కోరుకొనునది ప్రశాంతియే. కాని, మనస్సు తమ వశములో లేకపోవుట వలన, ఆలోచనలను ఆపుట చేతకాక తన మనస్సునకు ఆవల ఉన్న తన నిజస్థితియైన 'ప్రశాంతి'ని అనుభవించలేక పోవుచున్నారు. 'ఆత్మ' యొక్క నిజస్థితి 'ప్రశాంతి'యే. ఆ ప్రశాంతికే 'త్రిపురా' అనిపేరు. దానికి వాస్తవముగా నామరూపములు లేవు. అదియే తన శక్తితో, వశములో ఉన్న అంతఃకరణముతో కొన్ని దైవీశక్తులను, వశములో లేని అంతఃకరణముతో కొన్ని జీవశక్తులను కల్పించి, (సృష్టించి) చిత్రవిత్రములుగా కనిపించు లోకములను జగత్తును ఏర్పరచి, కొంతకాలము దానిని సాగించి, మరల ప్రళయము చేయుచున్నది. అనుభజ్ఞులైన మహాత్ములను, అట్టి దైవీశక్తులను, ఆశ్రయించిన జీవులు అంతఃకరణమును వశము చేసుకొని సత్యమైన 'ఆత్మ'ను అనుభవముగా పొంది 'త్రిపురా' స్వరూపులగుచున్నారు. అట్టి మహాత్ములే సత్యగురుదేవులగుచున్నారు.

ఇతరులందరు క్రమముగా సత్యగురుదేవులను, త్రిపురా స్వరూపులైన సత్యదేవతలను ఆశ్రయించి భక్తిశ్రద్ధలతో వారి ఆదేశములను పాలించి శాంతిని, ప్రశాంతిని, పరమానందమును తమతమ సంస్కార సాంగత్య సాధనల శుద్ధతను, బలమును బట్టి పొందుటకు అవకాశమున్నది.

సర్వజీవులలోను మానవ జన్మ ఉత్తమమైనదని చెప్పబడుటకు కారణము, మనుష్యులలోని మనో బుద్ధి చిత్త అహంకార రూపమైన అంతఃకరణ శక్తి అమితముగా విజృభించుటకు అవకాశముండుటే కాక, అంతఃకరణమునకు మూలమైన సత్, చిత్, ఆనంద రూపమైన ఆత్మ, (అహం, నేను) అనబడు తన నిజస్థితిని అనుభవముగా

తెలిసికొని పునర్జన్మ లేకుండ నిత్యానంద స్థితిని పొందు అవకాశముండుటయే. ఇట్టి అవకాశము మరి యే యితర రకములైన జీవులకును, కొందరు దేవతా జాతులకు కూడా లేదు. ఆత్మయొక్క సత్యస్వరూప అనుభవములేనివారు ఎంత గొప్పవారైనను కొంతకాలమునకు మార్పు కలిగి క్షీణదశకు వచ్చి అశాంతిని పొందవలసినదే. కారణమేమనగా శరీరములు ఎట్టివైనను కొంతకాలమునకు క్షీణింపకను, నశింపకను తప్పదు.

శరీరము అనగా 'నశించునది' అని అర్థము. కర్మసంబంధము కర్మకు కారణమైన మనస్సు, సంకల్పములు మారిపోవునవియే కాని సత్యములు, నిత్యములు కావు. పరమాత్మ స్వరూపుడైన పరమ గురుదేవుని ఆశ్రయించి, అంతఃకరణమునకు ప్రకాశమును శక్తిని యిచ్చు నిత్యసత్యమైన ఆత్మస్వరూపమే తన నిజ (అహం) స్వరూపమని అనుభవముగా తెలియు వరకు మరల మరల మరణించుచు, జన్మించుచు ఉండుట తప్పనిసరియైన సృష్టి లక్షణమే. కావున తన నిజ స్వరూపానుభవము పొందుటకై సద్గురువును ఆశ్రయించుటకంటె, నిత్య సత్యానందమును పొందుటకు వేరు మార్గము లేదు. సద్గురువు సర్వశక్తిమంతుడు. 'భావనోపనిషత్తు' ప్రారంభములోనే ఈ విషయమును 'శ్రీగురుః సర్వకారణ భూతాశక్తిః । తేన, నవరంధ్రరూపోదేహః నవచక్ర రూపం శ్రీచక్రం' "శ్రీగురుదేవుడు సర్వమునకు మూలకారణమైన శక్తి స్వరూపుడు. అతనివలన నవరంధ్రములతో కూడిన దేహము, నవ చక్రములతో కూడిన శ్రీచక్రముగా (పరమాత్మ స్వరూపముగా) అనుభవమునకు వచ్చును' అని చెప్పబడింది. అట్టి సర్వకారణమైన పరాశక్తి యొక్క విలాసమే యీ చిత్రవిచిత్రములుగా కనిపించుచు నశించుచున్న ప్రపంచము. ఇట్టి ప్రపంచములెన్నియో ఆ పరాశక్తి యొక్క విలాసములో అణువణువులుగా ఉన్నందువలననే ఆ శక్తికి 'అనంతకోటి బ్రహ్మాండ నాయకి' అని ప్రసిద్ధి. ఆ పరాశక్తిలో మన స్థితి ఎంత అల్పమో భావించి, మనవంటి జీవులన్నిటికీ మాతగా ఉన్న ఆ పరాశక్తిని మాతృభావనతో ఆరాధించి సేవించుట వలన ఆ మాతృశక్తికి, పరమానందమునకు వారసులము కాగలము అనెడి శ్రీగురుబోధను గ్రహించి సాధన చేయుటే మన కర్తవ్యము. ఆ పరమేశ్వరిని మన తల్లిగాను, మనము ఆ తల్లియొక్క అంశలమైన పిల్లలముగాను భావించి, మనకు ఆ అమ్మకు భేదము లేని ఆత్మీయతను అనుభవించుటే సాధనలోని ఉత్తమ స్థితి అందువలననే పరమేశ్వరిని ధ్యానించు శ్లోకములో 'అరుణాం కరుణాతరంగితాక్షీం ........అహమిత్యేవ విభావయే(త్) భవానీం' ఆ భవానీమాతను 'నేను' అనియే, 'నేనే' అని విశేషముగా భావన చేయుచున్నాను, చేయుదును, చేయవలెను అని చెప్పబడినది.

శ్రీసద్గురుదేవుని పరమ ఉపదేశ వాక్యములగు 'తత్త్వమసి', 'అహం బ్రహ్మాస్మి' అనుదానికి తాత్పర్యము. "నేను ఆ పరాశక్తి స్వరూపమే" అనెడి అనుభవమే. అదియే మానవజీవిత పరమావధి. అట్టి స్థితి అనుభవమునకు వచ్చుటకు అనుభవజ్ఞుడైన సత్యగురుదేవుని ఉపాసన చేయుటకంటె వేరు మార్గము లేదు. గురుదేవుని ఉపాసించుట అనగా భగవద్గీతలో చిట్ట చివర బోధచేయబడిన "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" – "అన్ని ధర్మములను పూర్తిగా విడిచిపెట్టి నన్ను ఒక్కనినే శరణుపొందుము" – అను చరమ పరమ బోధను అనుసరించి ఆచరించుటే. అట్లు శరణాగతి భావము స్థిరమగుటకు పరమగురుదేవుడగు దత్తాత్రేయ భగవానుడు అవతార పురుషుడనబడన పరశు–రామునకు, జగన్మాతయు, పరాశక్తియు, పరమాత్మ స్వరూపిణియు  అగు  ' త్రిపురామహేశ్వరి' ని ఉపాసన చేయుటకు దీక్షతో కూడిన ఉపదేశమిచ్చి, ఆమె 'ఆత్మస్వరూపిణి' అనెడి పరిపూర్ణ జ్ఞాన అనుభవము కలుగుటకు సోపానముగా 'త్రిపురా పరమేశ్వరి' యొక్క మాహాత్మ్యమును వివరముగా బోధించెను. ఆ సంగతులన్నియు ఆరువేల ఆరువందల ఎనుబది ఏడు (6687) శ్లోకములలో ఎనుబది (80) అధ్యాయములుగల 'త్రిపురా రహస్య మాహాత్మ్యఖండము' అనుపేరుతో పరశురాముని శిష్యుడగు 'హారీతాయనుడు' అనబడు 'సుమేధు' నిచే గ్రంథస్థము చేయబడినది. దాని సారాంశము సంగ్రహముగా ఇట్లున్నది.......

శ్రీ దత్తాత్రేయ భగవానుని బోధన సారము– "రామా! వినుము. 'త్రిపురా అని చెప్పబడుచున్న ఆ దేవికి పరమాకాశమే రూపము. ఆమెయందే ఈ విశ్వమంతయు వివిధ పదార్థములుగా విభజింపబడియున్నది. చిదానందము, అద్వయము అయిన ఆత్మయే ఆమెకు రూపము.ఆమె వాక్కులకు, ఇంద్రియములకు మనస్సునకు అందక, దానికి సాక్షియై, సకలమునకు ఆధారమై ఉన్నది. భక్తులపై దయచేత ఆమె ఎన్నో రూపములను ధరించుచు, అనేక లీలలను ప్రకటించుచున్నది. వానిని అన్నింటిని లెక్కించి చెప్పుటకు ఆదిశేషునకు కూడ సాధ్యముకాదు. కావున ఆమె యొక్క ప్రధాన రూపములను కొన్నింటిని చెప్పెదను. 1. కుమారి, 2. త్రిపుర, 3. లక్ష్మి, 4. సరస్వతి, 5. గౌరి, 6. కాళి, 7. చండిక, 8. దుర్గ, 9. కాత్యాయని, 10. లలిత అనురూపములు పేర్కొనబడుచున్నవి. వీనిలో లలిత శ్రీహారాజ్ఞి. ఆ రూపము పూర్ణతమము.

వీనిని కొంత వివరముగా తెలుసుకొనవచ్చును. వీరి చరిత్రలు బ్రహ్మాండాది పురాణములలో రకరకములుగా తెలుపబడినవి.  ఇందులో కొన్ని చరిత్రలు మనలో కొంతమందికి కొంత కొంతగా తెలిసి యున్నవే. పెద్దల వలన శ్రద్ధగా వినినచో భక్తి భావము పెంపొంది, క్రమక్రమముగా పరాభక్తి ఏర్పడి ఆత్మైక్య జ్ఞానానుభవము

పొందుటకు అవకాశము కలుగును. అందువలన భగవతి. భగవంతుల మహిమలను, మహాత్ముల చరిత్రలను వినుట, సద్గతిని పొందుటకు సహాయపడును. కేవలము లౌకికమై, తాత్కాలికములైన సమస్యలు, కోరికలు తీరుటకు మాత్రమే, మహాత్ములను దేవతా స్వరూపములను ఆరాధించుచు సేవించుట వలన కలుగు ఫలితములు కూడ అనిత్యములు తాత్కాలికములుగానే వుండును. వానివలన జీవన సమస్యలు సంపూర్ణముగా తీరిపోవు. మానవ జీవిత లక్ష్యమును సరిగా తెలిసికొని, దానిని సాధించి పరమశాంతిని పొందుటకు భగవద్భక్తిని పెంపొందించుకొనినచో మనము ఆరాధించు భగవద్రూపము సద్గురు రూపములో మనకు లభించి సమస్యలన్నిటికీ పరిష్కారమార్గమైన స్వాత్మజ్ఞానానుభవము కలిగించి ప్రశాంతిని, పరమానందమును కలిగింపజాలును. సాధనలో ఎదురైన సమస్యలను దాటిపోవుటకు మార్గములు సద్గురుదేవుని వలననే తెలియుగలవు. వారి ఆదేశమును బట్టి ఆచరించిన భగవదారాధనలు తాత్కాలిక సమస్యలతోపాటు శాశ్వత సమస్యలను పరిష్కరించుటకు లేదా అధిగమించుటకు వుపకరించును.

ఏ మంచిపనియైనను మనకు తోచినట్లు మాత్రమే చేయుటకంటె 'గురుబుద్ధిః విశేషతః ' అను సూత్రము ప్రకారము అనుభవము గల గురుజనుల ఉపదేశము ననుసరించి ఆచరించుటయే శ్రేయస్కరము. అందువలననే శ్రీగురుస్వరూపిణియైన శ్రీమాతాజీ, శ్రీదేవీ నవరాత్రమహోత్సవములు, శ్రీసద్గురుదేవుల ఆరాధన మహోత్సవములు, శివరాత్రి, శ్రీరామనవమి, శ్రీకృష్ణాష్టమి మొదలగు పర్వ దినోత్సవములు, మౌనధ్యాన సప్తాహములు మొదలగు కార్యక్రమములలో శ్రీలలితా సహస్రనామ, గురుసహస్రనామ, శివ, రామ, కృష్ణ సహస్రనామ అష్టోత్తర శతనామ పారాయణలు, పూజలు, జప ధ్యాన సంకీర్తనాదులుఏర్పాటుచేసి, భక్తుల ఆధ్యాత్మిక అభివృద్ధికి ప్రోత్సహించుచున్నారు. బుద్ధిమంతులైనవారు ఆ కార్యక్రమములలో "శ్రద్ధావాన్ లభతే జ్ఞానం, తత్పరః సంయతేంద్రియః' అని భగవద్గీతలో చెప్పబడినట్లు శ్రీగురుదేవుల ఉపదేశములను, ఆదేశములను శ్రద్ధ, తత్పరత, ఇంద్రియ నియమ నిగ్రహములతో కూడిన క్రమశిక్షణలతో ఆచరించినచో శీఘ్రముగానే, అల్పకాలములోనే చిత్తశాంతిని, ఆత్మజ్ఞానానందమును పొందగలుగుట, భగవదనుగ్రహము, సద్గురు దేవుల కృపాఫలముగా అనుభవించగలము.

సర్వాత్మ భూతం యద్రూపం విచార్యావగతం, స్ఫుటం ముక్తిః స్యాత్; అన్యథా బంధః; సా భవేత్ త్రిపురైవ 'హ్రీం'॥ ఓంతత్సత్. శ్రీగురుశ్శరణమ్।

*

# కపట ప్రేమ - దివ్య ప్రేమ

-మల్లీ ప్రియ

పరమేశ్వరుని ప్రేమ దివ్యప్రేమ. అది స్వార్థ రహితమైనది. నిజజీవితంలో కనిపించే ప్రేమ సాధారణంగా స్వార్థంతో కూడి ఉంటుంది.

పుళిందుడనే కిరాతుడు సప్తర్షుల ప్రేరణతో భార్యాబిడ్డల వద్ద కేగి "నేను దొంగతనాలను చేసి మిమ్మల్ని పోషిస్తున్నాను. అది పాపమని తెలిసింది. ఈ పాపంలో మీరూ భాగం పంచుకుంటారా?" అని అడిగాడట. "నీవు ఎలా సంపాదిస్తున్నావో మాకేం తెలుసు? నీవు తెచ్చిపెడితే తింటున్నాం. నీ పాపంతో మాకు పనిలేదు" అన్నారు భార్యాబిడ్డలు. వారిది స్వార్థంతో కూడిన ప్రేమ అని గ్రహించిన ఆ కిరాతుడు పరివర్తనం చెందాడు. పిదప వాల్మీకియై రామాయణ మహాకావ్యం వ్రాశాడు.

పరమాత్మను చేరటానికే మనమంతా కృషి చేయాలి. అదే మానవుడు ఆశించవలసిన పరమార్థం. నదులన్నీ సాగరంలో లీనమై, తమ నామరూపాలను కోల్పోయినట్లే భగవంతునిలో లీనమై మానవుడు తన నామరూపాలను కోల్పోతాడు. ఈ పరమాత్మను వెతకటంలోనే మనమంతా పొరపడుతున్నాం. పరమాత్మ కోసం ఎక్కడెక్కడో వెతకటం అవివేకం. ఆ పరాత్పరుడు మనలోనే ఉన్నాడు. అయితే ఆవరణ శక్తిచేత మోసగింపబడి మానవుడు తన హృదయంలోని పరమాత్మను గుర్తించలేకుండా ఉన్నాడు.



దేనికీ భయపడక పోయినా, మానవుడు మృత్యువునకు భయపడతాడు. అయితే, మృత్యుంజయుడే మన వద్ద ఉంటే మనం ఎందుకు మృత్యువుకు భయపడాలి?

చీకటి గది ఉంది. అందులో ప్రవేశించగానే బెంచీలు, కుర్చీలు మనల్ని కొట్టుకుంటాయి. వెంటనే మనం జేబులోని బ్యాటరీలైటును వేస్తే వెలుగు ప్రసరించి, చీకటి మాయమై గదిలోని అన్ని వస్తువులూ మనకు కనిపిస్తాయి. ఆ వెలుగే పరమాత్మ, బ్యాటరీలైటే మన జీవితం. ప్రపంచమే చీకటి. మనం చేయవలసినదల్లా బ్యాటరీలైటును నొక్కి వెలుగును తెప్పించుకోవటమే. అంటే దివ్యజ్ఞానాగ్ని మనలో రగుల్కొనాలన్నమాట!

అర్జునుని అజ్ఞానాన్ని పరమాత్మ ఏ విధంగా పోగొట్టాడో, మనకు సత్య

పరిశోధనా తపన ఉంటే మన అజ్ఞానం కూడా పరమాత్మ అలాగే పోగొట్టగలడు. నారదుడు ధర్మరాజును యిలా అడిగాడు "నా కంటే నీవు ఎంతో గొప్పవాడివి, అదృష్టవంతుడివి. పరమాత్మను 'బావా!' అని పిలిచే అదృష్టం నీకే దక్కింది. నిరంతరం ఆయనతో తిరుగుతూ, ఆయనకు ఆతిథ్యం యిస్తూ, ఆయన చెంత ఆతిథ్య.ం పొందే అదృష్టవంతుడివి నీవు. ఈ భూమిపై ఏ మహర్షికీ కూడా యింత అదృష్టం దక్కలేదు".

నిజమే! ధర్మరాజు అదృష్టమే అదృష్టం. ప్రయత్నిస్తే అలాంటి అదృష్టం మనకూ లభిస్తుంది. గోపికలు వెన్నచిలుకుతుంటే కృష్ణుడు వచ్చి కూర్చునేవాడు. యమునా నదికి వెళ్తుంటే వెంటపడేవాడు. ప్రయత్నిస్తే మనం కూడా పరమాత్మ మన చెంత వుండేటట్లు చేసుకోవచ్చు! అలా చేసుకోవాలంటే ముందు మనం ఆయన వెంటపడాలి!

భగవంతుణ్ణి చేరటానికి మనకు మార్గం చూపించే వ్యక్తినే గురువు అంటాం. "గురుబ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః గురుస్సాక్షాత్ పరబ్రహ్మ" అనటంలోనే సద్గురువు యొక్క స్థానం ఎంత ఉన్నతమైనదో మనం గ్రహించవచ్చు. మీరాబాయి అన్నట్లు 'సత్యమనే నావను నడిపే చుక్కానియే సద్గురువు' ఆ సద్గురువు మనల్ని భవసాగరాన్ని దాటిస్తాడు. అవతలి ఒడ్డున ఎవరున్నారు? ఇంకెవరు? ఆ కృష్ణపరమాత్మ. కాబట్టి మనం సద్గురువు అనే స్వార్థరహితమైన చుక్కాని ఆధారంతో సత్యమైన నావను ఎక్కి, భవసాగరాన్ని దాటి, అవతలి ఒడ్డున ఉన్న కృష్ణపరమాత్మను సందర్శించాలి.

మనం సేవించవలసినది కాఫీ కాదు, కృష్ణతారకౌషధాన్ని, రామతారక ఔషధాన్ని, జగజ్జనని దివ్య సంకీర్తనామృతాన్ని. అలాంటి కృష్ణ తారకౌషధాన్ని మనకు నిత్యమూ ప్రసాదించే మహాపురుషుడే నిజమైన సద్గురువు.

*

– కామం , క్రోధం , మదం , మాత్సర్యం , ఈర్ష్య , అసూయ – ఇవి మనలోనే ఉండి జ్ఞానరత్నాన్ని దొంగిలించేవి. జాగ్రత్త!

– గురువు రెండు పాదాలలో ఒకటి భక్తిని, రెండవది వైరాగ్యమును ప్రసాదించగలవు.

– భక్తి అంటే నమ్మకం , వైరాగ్యం అంటే ఆజ్ఞ మీరక ప్రవర్తించటము.

– కాళీబాబు

# నేను అర్థం చేసుకున్న శ్రద్ధాత్రయ విభాగ యోగం

- కొండ వెంకట్రాజు

గత సంచిక తరువాయి

*యజ్ఞము యొక్క త్రిగుణ శ్రద్ధలు -*

చిన్న యజ్ఞాలు అనేవి చిన్న కుటుంబాలు (భార్య, భర్త, పిల్లలు కలిసి) చేసుకునేవి. సత్యనారాయణ వ్రతము, గణపతి పూజ, శివుని అభిషేకాలు మొ॥ యీ కోవలోకి వస్తాయి. సామూహికంగా చేసుకునే యజ్ఞాలు కొన్ని ఉన్నాయి. పాదపూజలు, దసరాపూజలు, ఆరాధన పూజలు, చండీయాగాలు మొదలైనవి. ఈ సామూహిక పూజలకి సరిపడా ద్రవ్యము, పూజా సామగ్రి, పాడి ఆవులు. అగ్ని కుండాలు, దక్షిణలు, అన్న వితరణలు మొదలైనవి ముందుగానే ఏర్పరచుకోవాలి. ఇంకా ఏ సేవ చేయగలిగిన వారు ఆ సేవ చేయటానికి దండిగా తర్ఫీదు అయి ఉండాలి. ఇవి అన్నీ శ్రీబాబూజీ మనకు ఆశ్రమంలో సమకూర్చిపెట్టారు.



ఇవేకాకుండా భగవద్ధ్యానము, పరోపకారము, దైవసంబంధమైన అన్ని కార్యక్రమాలు యజ్ఞాల క్రిందే వస్తాయి అని పెద్దలు వివరించారు. బాబూజీ స్థాపించిన హాస్పిటల్ (వైద్యసేవ), స్కూలు (విద్యాసేవ), అన్నదానము లాంటివి కూడా యజ్ఞాలే. ఇవి ఒకరోజు, ఒక పక్షంలో అయిపోయేవి కావు. అందుకే వాటిని మహాయజ్ఞాలుగా అభివర్ణించటం సబబు. మనం ఆశ్రమ ప్రార్థన తెల్లవారుజామున ఒక గంట, సాయంత్రం ఒక గంట 365 రోజులూ విడవకుండా ఒక మహాయజ్ఞంలాగ ఆచరిస్తూనే ఉన్నాము. ఈ విధంగా శ్రీబాబూజీ మహరాజ్ స్థాపించిన మన ఆశ్రమంలో అన్నిరకాల యజ్ఞాలు మాతాజీవారి ఆధ్వర్యంలో జరుగుతూనే ఉన్నాయి. ఈ యజ్ఞాలను మూడు గుణాలుగా విభజించి భగవంతుడు ఈ అధ్యాయంలో వివరించాడు.

సాత్విక యజ్ఞం - శాస్త్రోక్తమైనది. ఫలాపేక్ష లేకుండా చేయబడేది. ఈ యజ్ఞం చేయదగినదే అని మనస్సును సమాధానపరచుకొని చేయునది సాత్విక యజ్ఞం అనబడతాయి. మనం పెట్టవలసిన శ్రద్ధని యిక్కడ కూడా అన్వయించుకోవాలి. చేయదగినదే అంటే పూర్తి విశ్వాసంతో నమ్మకంతో యజ్ఞం చేసుకోవాలి.

రాజస యజ్ఞం - ఫలాన్ని ఆశించి, డంబానికి, పేరుప్రఖ్యాతలకొరకు, విశ్వాసము లేకుండా చేసే యజ్ఞాలు రాజస యజ్ఞాలు.

తామస యజ్ఞం - శాస్త్రాన్ని పాటించకుండా, అన్నదానం లేకుండా, మంత్రరహితమైన, అతిథి సత్కారాలు లేకుండా, దక్షిణలు లేకుండా, బొత్తిగా శ్రద్ధ లోపించిన యజ్ఞాలు తామస యజ్ఞాలు. ఇలాంటి యజ్ఞాలు భూమిలో పోసిన పన్నీరే అవుతాయి. చవిటి భూమిలో పెట్టిన విత్తనం వ్యర్థం అయినట్లు.

తపస్సు యొక్క త్రిగుణాలు -
ఈ తపస్సు కూడా మూడు విధాలుగా విభజింపబడింది. శరీరం చేత చేయదగిన తపస్సు, వాక్కు చేత చేయదగిన తపస్సు, మనస్సు చేత చేయదగిన తపస్సు.

*శరీరముచేత చేయబడే తపస్సు సాత్విక తపస్సు -*

భగవంతుడికి, బ్రహ్మా విష్ణువులకు, గురువులకు పూజ చేయటం, సత్కరించటం, సత్యం పలకటం, దయగల్గి ఉండటం, సన్మార్గంలో ప్రవర్తించటం, జీవహింస చేయకుండటం మొదలైనవి సాత్విక తపస్సులు అని చెప్పబడతాయి. పెద్దలను, గురువులను బ్రహ్మావిష్ణువులను పూజించుట వలన రెండు లాభాలు చేకూరుతాయని పెద్దలు చెబుతారు. 1. వారి అనుగ్రహం కలుగుతుంది. తద్వారా దుస్తరమైన మాయని ఎదుర్కోగలుగుతాము. 2. మన యొక్క అహంకారం, అభిమానం శమిస్తాయి.

*వాక్కు చేత చేయబడు సాత్విక తపస్సు -*

ఇతరుల మనస్సుకు బాధ కలగకుండా మాట్లాడటం, సత్యమైన వాక్కు, ప్రియమైన వాక్కు, యితరులకు మేలు చేకూర్చే వాక్కులు మాట్లాడటం మొ॥ సత్యవాక్కు తపస్సు అనబడుతుంది. సత్యమే అయినా చెడ్డవాక్కును పరుషంగా చెప్పకూడదు. హితముగా ప్రియముగా మార్చి పలుకవలెను. మరియు వేదములు, ఉపనిషత్తులు, భగవద్గీత, భాగవతము, రామాయణము పఠనం కూడా సాత్విక వాచక తపస్సు అని తెలుస్తోంది. ఇక్కడ మనం ఆశ్రమ ప్రార్థనలో చెప్పుకొనే వాక్యం గమనించాలి. "సత్య సుందర స్వరూపుడవైన ఓ పరమేశ్వరా! సత్యముగను, పవిత్రముగను, మృదువుగను ఉండు వాక్కును" అని.

*మనస్సు చేత చేయబడు సాత్విక తపస్సు -*

1.మనస్సు తేటగా, నిర్మలంగా, కలత లేకుండా ఉండాలి. 2. ముఖం సౌమ్యంగా వికాశంగా ఉండాలి. 3. మనస్సును మౌనంగా ఉంచుకోవాలి. (దుష్ట సంకల్పాలు రాకుండా చూసుకోవాలి) 4. ఇంద్రియాలను, మనస్సును లెస్సగా నిగ్రహించాలి. 5.భావంలో పరిపూర్ణమైన శుద్ధత్వం కలిగి ఉండాలి. పైన చెప్పిన శారీర, వాచక, మానసిక తపస్సులకు మిక్కుటమైన శ్రద్ధని జోడించాలని 17వ శ్లోకంలో వివరించారు. అప్పుడే సాత్విక గుణాలు సంతరించుకోగలమని భగవంతుడు చెబుతున్నాడు. ఇక రాజస, తామస తపస్సుల గురించి తెలుసుకుందాం.

*రాజస తపస్సు* - ఇతరులచే సత్కరింపబడాలని చేసే తపస్సు. డంబాచారంగా చేసేది. ఇతరులచే గౌరవింపబడాలని, పూజింపబడాలని చేసే తపస్సులు.

*తామస తపస్సు* - మూర్ఖపు పట్టుదలతో, తన శరీరమును బాధపెట్టుకొని చేసేవి,

- సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

ఒకసారి శ్రీబాబు దర్శనం చేసిన తరువాత పరిపూర్ణ పరివర్తనం పొందిన చిరంజీవిరాజుగారు శ్రీబాబును ప్రాధేయపడి తమ యింటికే ఆహ్వానించి రప్పించుకున్నారు. శ్రీబాబుకు వారింట్లోనే నివేదన ఏర్పాట్లు చేసేవారు. అక్కడ కూడా శ్రీబాబు మొదట్లో తాము భోజనం చేసిన విస్తరిని తామే తీసివేసేవారు. దానిని తాకేటందుకు ఎవరికీ అవకాశం యిచ్చేవారు కాదు. ఆ కుటుంబ సభ్యుల భక్తి పరిపూర్ణత పొందిన తరువాతనే శ్రీబాబు వారికి ఆ అర్హతను ప్రసాదించారు.



చిరంజీవిరాజుగారు, వారి తల్లిగారు, వారి ధర్మపత్ని ముగ్గురూ శ్రీబాబును అత్యంత భక్తిశ్రద్ధలతో సేవించుకోవటం మొదలుపెట్టారు. తరువాత శ్రీబాబు ఎప్పుడు గుండుగోలను వెళ్ళినా వారింటికే వెళ్ళేవారు. శ్రీబాబు అప్పుడప్పుడు అందించే దివ్య సందేశాలను వారు తమ మనోఫలకంపై ముద్రించుకున్నారు. త్రికరణ శుద్ధిగా శ్రీబాబునే తమ కుటుంబానికి పెద్దగా, బంధువుగా, గురువుగా, దైవంగా భావించుకున్నారు.

అన్నిటికన్న ముఖ్యమైనది చిరంజీవిరాజుగారి నిర్మల, నిష్కపట హృదయము, సత్యవాక్కు. ఒకసారి శ్రీబాబు 'నిజమైన శిష్యుడు తన గురువు దగ్గర ఎన్నడూ తన మనస్సును దాచడు. అబద్ధం ఆడడు. ఆఖరికి తన గురువుపైనే ఏదైనా నీచభావనగాని, ద్రోహ చింతన గాని కలిగినా సందేహించక, అది గురువు వద్ద మనస్సు విప్పి చెప్పగల్గిన వాడే తరించగలడు' అని చెప్పారు.

అది విన్నప్పటి నుంచి చిరంజీవిరాజుగారు తన విలాసజీవితంలో తాము అంతవరకు చేసిన , చేస్తున్న పనులన్నిటినీ, యే మాత్రమూ దాచకుండా శ్రీబాబు వద్ద చెప్పి ఒప్పుకునేవారు. ఏ పూర్వ ప్రారబ్దం వలనో వారి మనస్సు అట్టి విలాసజీవితం పైన అనురక్తిని పొందినా, సత్యవాక్య నిబద్ధతలోనూ, గురుభక్తిలోనూ ఆ మనస్సు అమృత తుల్యమేనని, నవనీతము వంటిదని గ్రహించిన శ్రీబాబు అత్యంత ఆదరభావంతో ఆయనను చేరదీసి, సంపూర్ణంగా సంస్కరించి వేశారు.

తమవంటి అల్ప సంస్కారులను కూడా శ్రీబాబు చేరదీసి అభయమిచ్చారనే కృతజ్ఞతా భావము రాజుగారి హృదయాన్ని కదలించివేసింది. ఆయన భక్తివిశ్వాసాలు ముప్పేటగా పెనవేసుకొని శ్రీబాబును శాశ్వతంగా ఆయన హృదయంలో

బంధించివేశాయి. శ్రీబాబు కూడా ఆ భక్తిపాశాలకు కట్టుబడి, ఆయన హృదయంలో నిలచిపోయారు. ఆ బంధనలోని , స్వేచ్ఛ, ఆనందము, మాధుర్యము భగవానునికి, భక్తునికే తెలియాలి. అది అనుభవైకవేద్యమైనది.

రాఘవమ్మగారికి ప్రధమ సంతానంగా ఒక కుమారుడు కలిగాడు. ఆ బాలుడు దివ్యాంశతో, శంఖ, చక్రాది ముద్రలతో జన్మించాడని శ్రీబాబు శేషగిరిరావుగారితో చెప్పారు. నామకరణం చేయమని రాజుగారు కోరగా, ఎనిమిదవ మాసం వెళ్ళాక చేస్తానన్నారు శ్రీబాబు. కాని రాజుగారివైపు పెద్దలు పట్టుపట్టి పసివాడికి నామకరణం చేశారు. ఆ పిల్లవాడు ఎనిమిదవ మాసంలో గతించాడు. "ఆ పిల్లవాడికి ఎనిమిదవ మాసంలో మృత్యుగండం ఉందని, అది గడిచాక నామకరణం చేద్దామనుకున్నాను. కాని విధి మరొక విధంగా నిర్ణయించింది" అని శేషగిరిరావుగారితో అన్నారు శ్రీబాబు.

ఈ సంఘటన రాజుగారిలో విషయాదుల యెడల మరింత విరక్తిని కలిగించింది. ప్రపంచ వ్యవహారాల పట్ల తీవ్ర అనాసక్తతో, అనన్య చింతనులై వారు శ్రీబాబును శరణు పొందారు.

శ్రీబాబు రాజుగారికి మంత్రదీక్షను అనుగ్రహించారు. రాజుగారు అత్యంత శ్రద్ధాభక్తులతో ఆ మంత్రానుష్ఠానం చేశారు. ప్రతిరోజూ స్నానంచేసి ఉదయం ఆరుగంటలకు దేవతార్చనకు కూర్చున్న రాజుగారు, మధ్యాహ్నం ఒంటిగంట వరకు లేచేవారు కాదు. ఆ దీక్షాకాలంలో తమ అన్ని వ్యసనాలకు పూర్తి స్వస్తి పలికి, మితాహారియై కఠోర నియమ నిష్ఠలతో బ్రహ్మచర్యం పాటించారు.

తరువాత 1949, 1950 సం॥లలో కూడా దసరాపూజలు గోపాలరాజుగారి ఇంట్లోనే జరిగాయి. 1951, 52, 53 సంవత్సరాలలో శ్రీబాబు దసరాపూజలను రాజుగారింట్లోనే జరిపారు. అందువలన రాజుగారి దీక్షానుష్ఠానానికి మరింత బలం చేకూరింది. శ్రీబాబు దర్శనం వారికి చాలా తరచుగా లభించేది.

1952 - 53 సం॥లో రాజుగారు కుటుంబంతో సహా శ్రీశైలయాత్రకు బయలుదేరారు. శ్రీబాబును కూడా తమ వెంట రమ్మని ప్రార్థించారు. శ్రీబాబు తమకు పని ఉన్నదని, వాళ్ళను వెళ్ళిరమన్నారు. వాళ్ళు శ్రీశైలం వెళ్ళారు. శ్రీమల్లికార్జున స్వామి దర్శనంచేసుకుని, బసకు వెళ్లేసరికి రాఘవమ్మగారికి విరేచనాలు ప్రారంభ మయ్యాయి. ఆమెను బసవద్దనే వదిలిపెట్టి, వాళ్ళు క్షేత్ర దర్శనానికి వెళ్ళారు. రాఘవమ్మగారికి విపరీతంగా విరేచనాలు అవచటంతో ఆమె అపస్మారక స్థితిలో పడిపోయారు. అప్పుడు శ్రీబాబు రాఘవమ్మగారికి ఆప్తబాంధవుని వలె అక్కడ దర్శనమిచ్చి, స్వయంగా ఆమెకు ఉపచారాలు చేసి, స్వస్థత కలిగించి, మళ్ళీ అదృశ్యమైనారు. రాజుగారు జరిగిన విషయం విని, శ్రీగురుదేవుల యెడల కృతజ్ఞతా వివశులై కన్నీరు పెట్టుకున్నారు.

- సశేషం

# రావణుని పూర్వ జన్మ వృత్తాంతము

గత సంచిక తరువాయి

- శ్రీ జ్ఞానానంద స్వామి

రాజు పూర్తిగా తన వశం అయినందుకు సంతోషిస్తూ ముని అతనితో యిలా అన్నాడు "రాజా! నీపైన ప్రేమతో నీ కోరికను నెరవేర్చాలని అనుకుంటున్నాను. రాజా! నీవు రోజూ ఒక లక్షమంది బ్రాహ్మణులకు వారి కుటుంబ సహితంగా అన్నదానం చేయి. వారికి స్వయంగా నేనే భోజన ఏర్పాట్లు చేస్తాను. నా మహిమ వలన నీ యింట భోజనం చేసిన బ్రాహ్మణులంతా నీ ఆధీనం అవుతారు. అంతేకాదు నీ యింట విందారగించిన బ్రాహ్మణుల యింట ఎవరైతే ఆతిథ్యం పొందుతారో వారు కూడా నీ వశం అవతారు. నేను నీ పురోహితుని రూపంలో నీ వద్దకు వస్తాను. మన రహస్యాన్ని ఎవరికీ చెప్పవద్దు. రాత్రి రెండు ఝాములు గడిచింది. ఇక నీవు విశ్రమించు. ఈ రోజుకి మూడవ రోజున నాదర్శనం నీకు కలుగుతుంది. నా తపోమహిమల వలన నీవు నిద్రించాక నీ తురంగ సహితంగా నిన్ను నీ మందిరానికి చేరుస్తాను" అన్నాడు.

ముని ఆజ్ఞ మేరకు ప్రతాపభానుడు విశ్రమించాడు. పగలంతా వేటతో అలసిపోవటంతో అతను గాఢ నిద్రలో మునిగిపోయాడు. కపట ముని తన ఆసనం మీద కూర్చుని తన మిత్రుడైన కాలకేతుని స్మరించాడు. కాలకేతుడు భయంకరమైన రాక్షసుడు. అతనికి తెలియని మాయలంటూ లేవు. ముని తన మిత్రుని చూసి చాలా ఆనందించాడు. అంతేకాదు ప్రతాపభానుని తాను ఎలా వశం చేసుకున్నాడో, అతనిని ఎలా నాశనం చేయాలని తాను ప్రయత్నిస్తున్నాడో తెలిపాడు. ముని ఆజ్ఞ మేరకు కాలకేతు, నిద్రిస్తున్న రాజును, అతని తురగముతో సహా కేకయ దేశానికి చేర్చాడు. ఆ తరువాత రాజపురోహితుని తీసుకుని ముని వద్దకు వచ్చాడు.

పక్షుల కిలకిలారావాలతో ప్రతాపభానునికి మెలకువ వచ్చింది. తాను తన మందిరంలో ఉన్నాని తెలుసుకుని రాజు చాలా ఆశ్చర్యపోయాడు. ముని తపోశక్తికి కొనియాడ కుండా ఉండలేకపోయాడు. నెమ్మదిగా తన శయ్య నుండి లేచి, ఎవరికీ తెలియకుండా తన అశ్వాన్ని తీసుకొని వనానికి వెళ్ళి రెండు ఝాములు దాటాక వచ్చాడు. ప్రతాపభానుని చూసి ప్రజలంతా ఆనందోత్సాహంతో పండుగ జరుపుకో సాగారు. కానీ రాజు మనస్సంతా ఆ కపటమునిపైనే ఉంది. మూడు రోజులు మూడు యుగాలుగా గడిపాడు. మూడవ రోజున కపటముని రంగంలోకి దిగాడు. తన హితుడేయని తలుస్తున్న మునిని చూసిన రాజు ఆనందానికి హద్దు లేకపోయింది.

కపటముని, కాలకేతు రాక్షసుని సహాయంతో భోజన సదుపాయాలను కావించాడు. రాజాజ్ఞ మేరకు, బ్రాహ్మణులంతా విందు భోజనానికి విచ్చేశారు. విందులో

వడ్డించిన పదార్థాలను చూసి విప్రవర్యులు ఆశ్చర్యపోయారు! కారణం వారు అన్ని రకాల పదార్థాలు వినటమేకానీ, చూసి ఎరగరు. ప్రతాపభానుని స్తుతిస్తూ, అతనికి ఆశీర్వాదం యిస్తూ భోజనానికి కూర్చున్నారు.

వారు విందారగించటానికి ఆయత్తులవుతుండగా, అశరీరవాణి యిలా పలికింది – "విప్రవర్యులారా! తొందరపడి విందారగించకండి. అందులో గోమాంసం కలపబడి ఉంది" అశరీరవాణి మాటలు విన్న బ్రాహ్మణుల కోపానికి అంతులేకుండా పోయింది.

కోపాన్ని పట్టలేని బ్రాహ్మణులు రాజును శపిస్తూ........."మూర్ఖుడా! మమ్మల్ని కపటంతో మోసం చేద్దామని అనుకున్నావా? బ్రహ్మ స్వరూపులైన మమ్ములను మోసం చేయటం తేలిక కాదు. ఈశ్వర కృపవలన మా ధర్మాన్ని మేము రక్షించుకో గలిగాము. మమ్మల్ని మాయతో మోసం చేసినందుకు నీవు నీ పరివార సహితంగా నిశాచర జన్మను పొందు. మా శాపానికి తిరుగు లేదు."

బ్రాహ్మణుల శాపానికి రాజు భయకంపితుడైనాడు. తాను ఏ పాపమూ ఎరుగననీ, శాపాన్ని ఉపసంహరించుకోమనీ ప్రార్థించాడు. రాజు మాటలకు బ్రాహ్మణులు శాంతించి, అతనితో యిలా అన్నారు "రాజా! నీ తప్పు లేనప్పటికి, నీవు శాపానికి గురికాక తప్పదు. బ్రాహ్మణుల శాపం చాలా భయంకరమైనది. దానికి తిరుగులేదు." అని వారు రాజసౌధాన్ని వీడి వెడలిపోయారు.

బ్రాహ్మణ శాప కారణంగా సత్యకేతు వంశంలోని వారంతా నాశనం అయ్యారు. పుణ్యాత్ముడైన ప్రతాపభానుడు, ఒక దుష్టుని సాంగత్యం వలన తాను నష్టపోవటమేకాక తన వంశమువారు, తన పరివారము కూడా నష్టపోవడానికి పరోక్షంగా కారణభూతుడయ్యాడు. కాలము గడచిన వెనుక ప్రతాపభానుడు రావణునిగా, అరిమర్థనుడు కుంభకర్ణునిగా, ధర్మరుచి విభీషణునిగా జన్మించారు. పులస్త్య మహాముని పుత్రులుగా జన్మించినప్పటికీ బ్రాహ్మణుల శాప కారణంగా వారు నిశాచరులైనారు.

*

**విశ్వాసం, ధ్యానం ద్వారా జీవితంలో ఎదురయ్యే ఒడి దుడుకులను అద్భుత ప్రవాహంగా మార్చుకోవచ్చు.**

– శ్రీ కాళీబాబు

విష్ణు  కథలు

(గత సంచిక తరువాయి)

-రమణ ప్రసాద్

# 3.తులసీదాసు

***భగవానుడు తులసీదాసుకు శ్రీ రామమూర్తి రూపమున దర్శనమిచ్చుట***

భగవానుడు శ్రీరాముని రూపము ధరించగా లక్ష్మీదేవి సీత రూపమును, శంఖ చక్రాలు భరత శత్రుఘ్నుల రూపములను, ఆదిశేషుడు లక్ష్మణ రూపాన్ని ధరించి దివ్య విమానం ఎక్కి హనుమంతుడు ఆనందంతో నాట్యంచేస్తూ నడుస్తుండగా ఎంతో వైభవముతో వస్తున్న వారలను పురజనులు ఎంతో ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.



తులసీదాసు అత్యంత సంతోషంతో, పరాత్పరుడు నా పై కరుణించాడు, నా జన్మ తరించింది. నా భవబంధాలు తొలగిపోయాయి అని ఆనందించాడు. శ్రీ రామచంద్రమూర్తి సత్రంలోకి వచ్చి తులసీదాసును ఎంతో ప్రేమతో కౌగలించుకున్నాడు. "కుమారా! నీ భక్తి ప్రపత్తులు శ్లాఘనీయములు. నీవు నా దర్శనం కోరుకున్నావు కదా! తనివి తీరా దర్శించు. నీకు కావలసిన వరాలను కోరుకో అని తులసీదాసు శరీరాన్ని తన చేతితో నిమిరాడు. విష్ణుమూర్తి కరస్పర్శకు తులసీదాసు జ్ఞాన ప్రకాశవంతుడైనాడు. తులసీదాసు శ్రీ రామచంద్రుని అనేక విధాల పొగడి ఆనందంతో నృత్యం చేశాడు.

శ్రీ రామచంద్రుడు "నీ అభీష్టమును తెలియచెయ్యి" అనగా తులసీదాసు "దేవా! నీ దర్శనం వల్ల నా అభీష్టాలన్నీ ఫలించాయి కాని మీరు పరిపూర్ణ అనుగ్రహంతో కోరుకొమ్మన్నారు కనుక నేను వరాలను అడుగుతున్నాను. నేను తలచినప్పుడల్లా సీతా సమేతంగా నాకు దర్శనం యివ్వాలి. ఏ ఆనందం పరమ ఉత్కృష్ఠమైనదో, దేని వల్ల పాపాలు తొలగుతాయో అట్టి పరమానంద స్థితిని నాకు అనుగ్రహించండి ప్రభూ! వేరే వరం నేను కోరను" అన్నాడు.

శ్రీ రాముడు "భక్తశిఖామణి! నీకు జ్ఞాన దృష్టిని ఇస్తున్నాను. నీవు పూర్వజన్మలో వాల్మీకి మహర్షివి. భగవదాజ్ఞచేత భూలోకంలో పామరులను వుద్ధరించటానికై అవతరించావు" అనగా, ఆ విషయమును విశదంగా తెలుసుకొన్నాడు

తులసీదాసు. శ్రీ రామచంద్రమూర్తికి నమస్కరించి "నాకు తత్వోపదేశం చేసి కృతార్థుణ్ణి చెయ్యండి" అనగా "నాయనా! ఆంజనేయమూర్తిని ఆశ్రయించి బ్రహ్మోపదేశాన్ని పొందు. నీవు పూర్వం దేవభాషలో రచించిన రామాయణాన్ని హిందూస్థానీ భాషలో రచించి పామరులకు చేరేటట్లు చెయ్యి. వారందరూ భక్తి శ్రద్ధలతో నిరంతరం పారాయణచేసి నా పదాన్ని పొందేటట్టు చెయ్యి" అని అంతర్ధానమైనాడు.

తులసీదాసు శ్రీ రామచరితము అను గ్రంథాన్ని రచించసాగాడు. సత్రంలో రాత్రింబగళ్ళు శ్రీ రామ భజన జరుగుతూ ఉండేది. ప్రజలు శ్రవణ కుతూహులులై వచ్చేవారు. కొందరు భక్తులచే సమర్పించబడిన వెండి బంగారు పాత్రలు, పూజోపకరణాల పై ఇద్దరు దొంగలు మాటువేసి అర్ధరాత్రి సత్రంలో ప్రవేశించి వాటిని ఎత్తుకొని పోతుంటే, ధనుర్ధారులైన ఇద్దరు మహా పురుషులు జాగరూకులై ఉండటం చూసి తాము దొంగిలించిన వాటిని యథాస్థానమందు ఉంచి పారిపోతుండగా ద్వారపాలకులు వారిని అడ్డగించారు. వారు "మమ్ము రక్షించ"మని తులసీదాసుని ప్రార్థించారు. తులసీదాసు చోరులను అడ్డగించినవారు రామలక్ష్మణులుగా తెలిసికొని అనేక విధాల వారిని శ్లాఘించి చోరులతో "మీరు మహా భాగ్యవంతులు కనుకనే మీకు వారి సేవ లభించింది" అన్నాడు. వారు దొంగతనానికి స్వస్తి చెప్పి తులసీదాసుకు శిష్యులైనారు.

తులసీదాసు వారిని ఈ విధంగా కీర్తించాడు.

మై హరి పతిత పావన్ సునై<br>
మై పతిత తాకు పతిత పావన్ దోఊ బానక బనై ॥మై హరి॥<br>
వ్యాధ గనిక గజ అజామిళ సాఖీ నిగమనిబనై<br>
ఔర్ అధమ అనేక తారె జాత కా పైగనై ॥మై హరి॥<br>
జానినామ అజాని లీన్హే నరకసురపురమనై<br>
దాస తులసీ శరన ఆయో రాఖియే ఆపనై ॥మై హరి॥

భగవానుడు పతితపావనుడని విన్నాను. నేను పతితుడను. నాస్వామి పతితపావనుడు. ఆహా! ఎంత చక్కటి సంబంధం మాది? గజేంద్ర అజామిళులను వుద్ధరించినట్లు శాస్త్రం చెబుతుంది. ఎందరో భగవానుని కృపారసానికి పాత్రులైనారు. భగవన్నామాన్ని ఉచ్ఛరించినవారు నరక ద్వారాలనుండి బయట పడి స్వర్గం ప్రవేశిస్తారు. ప్రభూ! నీ ప్రభావాన్ని ఎరిగి నీ పాదపద్మాలను ఆశ్రయించాను" అని పరితాపంతో ఆవేదనతో రామదర్శనానికై దుఃఖించాడు.

ఒకనాడు తులసీదాసు భక్తులకు అన్న సంతర్పణం చేయ సంకల్పించి, భక్తులను అందరినీ ఆహ్వానించాడు. వడ్డిస్తున్న సమయంలో "జై జై రామచంద్ర రఘునాథా" అని ఒక నూతన వ్యక్తి వచ్చి తులసీదాసుకు నమస్కరించాడు. తులసీదాసు

ఆ వ్యక్తిలో రాముని దర్శిస్తూ అతనిని కూడా భోజనానికి పంక్తిలో కూర్చోపెట్టాడు. అక్కడివాళ్ళు తులసీదాసుతో "నీవు భోజనానికి ఆహ్వానించిన వ్యక్తి పరమ దుర్మార్గుడు, హంతకుడు. వీడు మా పంక్తిలో కూర్చొంటే సమారాధన అపవిత్రమౌతుంది. " అన్నారు.

తులసీదాసు భక్తులకు నమస్కరించి "అయ్యలారా! క్షమించండి ఇతడు నా వద్దకు వచ్చి రామనామం ఉచ్చరించాడు. అతని సకల పాపాలు తొలగిపోయాయి. ఇంకొక విషయం, మనం ఇతరుల పాపాలను ఎంచేవారమా? మన పాపాలను ప్రక్షాళన చేసికోవాలి. కనుక దయచేసి ఇతడిని భోజనం చెయ్యనివ్వండి" అని ప్రార్థించాడు.

తులసీదాసు చెప్పింది వారికి నచ్చలేదు. "నీ వాదన నిరాధారమైంది. ఇతడు మాతో కలిసి భోజనం చేస్తే అపవిత్రం అవుతుంది. నీ మాటలు సత్యమనటానికి మాకు ఏదైనా నిదర్శనం చూపించు. అప్పుడు నమ్ముతాము" అన్నారు అక్కడివారు.

తులసీదాసు హృదయాంతర్యామి అయిన రామునకు నమస్కరించాడు. "నాతో రండి. మీకు నిదర్శనం గోచరిస్తుంది" అని మఠానికి ప్రక్కన ఉన్న శివాలయంలోకి వెళ్ళాడు. ఒక పళ్ళెంలో ఆహారపదార్థములను ఉంచి "హే విశ్వేశ్వరా! భక్తవత్సలా! రామనామం భక్తుల పాపాలు పోగొట్టలేదా? ఈ భక్తుడు భుజిస్తే సమారాధన మైలపడిపోతుందా? నేను చేసినది అపరాధమా? నేను నిరపరాధిని అయితే ఈ ఆహారాన్ని నందీశ్వరుడు భుజించటమే నిదర్శనం" అని పలికి కళ్ళుమూసుకొని రామనామ స్మరణచేస్తున్నాడు. భక్తసమూహము చూస్తుండగా నందీశ్వరుడు కదలివచ్చి ఆహారాన్ని భుజించాడు. భక్తులందరూ తులసీదాసు పాదాలపై పడ్డారు. భగవానుడు భక్తుల పై చూపిన అపార ప్రేమకు తులసీదాసు నేత్రాలనుండి ఆనందభాష్పాలు జాలువారాయి.

ఒకనాడు ఒక స్త్రీ విలపిస్తూ వచ్చి తులసీదాసుకు నమస్కరించింది. ఆమె ఆవేదనకు స్పందించిన తులసీదాసు ఆమెను "దీర్ఘసుమంగళీ భవ" అని ఆశీర్వదిస్తాడు. ఆమె ఇంకా తీవ్రంగా ఏడుస్తూ "మహాత్మా! నా భర్త ఇప్పుడే చనిపోయాడు. నేను ఆ దుఃఖాన్ని భరించలేక మీ వద్దకు వచ్చాను. మీరుకూడా నన్ను అపహాస్యం చేస్తున్నారు" అని రోదించసాగింది. తులసీదాసు నిర్ఘాంతపోయి "తల్లీ! నీభర్త మరణించిన విషయం నాకు తెలియదు అప్రయత్నంగా నా నోటనుంచి ఆ పలుకులు వచ్చాయి. నా రాముడే అలా పలికించాడు. ఆ వాక్కులు వృధాకావు. నీవు వెళ్ళి చనిపోయిన నీ భర్త చెవిలో రామనామాన్ని ఉచ్చరించు. సందేహించకు, విశ్వాసంతో వెళ్ళు" అని చెప్పాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL